







పర్యావరణ శాఖ కొత్త ఉత్తర్వు ఉపసంహరించండి

ప్రధాని మోదీని కోరిన సీఎం స్టాలిన్

ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా

ఖనిజాల తవ్వకాలా?

చెన్నై, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అరుదైన ఖనిజాల తవ్వకాలకు సంబంధించిన మైనింగ్ ప్రాజెక్టులు చేపట్టేందుకు ఆయా ప్రాంతాల్లో ప్రజాభిప్రాయ సేకరణ నుంచి మినహాయింపు కల్పించేలా కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ప్రధాని నరేంద్రమోదీకి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 8న ఆ మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం అరుదైన ఖనిజవనరుల తవ్వకాలకు సంబంధించి స్థానికుల అభిప్రాయాలను తీసుకోవాల్సిన అవసరం లేదంటూ పేర్కొనటం గర్హనీయమన్నారు. రాష్ట్రంలోని సముద్రతీర ప్రాంతాల్లో అరుదైన ఖనిజ నిక్షేపాలున్నాయని, అలాంటి చోట్ల తవ్వకాలు జరిపితే పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, మన్నార్ జలసంధి, పాక్ జలసంధి ప్రాంతాలు, తాబేళ్ల సంతానోత్పత్తి ప్రాంతాలు, పగడపు దిబ్బలు, మడ అడవులు పర్యావరణానికి హాని కలుగకుండా, తుఫాను వరదలను అడ్డుకునే రక్షణ కవచాలుగా ఉన్నాయని, ప్రజాభిప్రాయ సేకరణతో నిమిత్తం లేకుండా ఈ ప్రాంతాల్లో అరుదైన ఖనిజాలకోసం తవ్వకాలు జరిగితే ఉపద్రవాలు తప్పవని స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. 1997లో ఖనిజాల తవ్వకాలకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ తప్పనిసరి అంటూ 1994నాటి పర్యావరణ ప్రభావ అంచనా చట్టాన్ని సవరించారని, ప్రస్తుతం ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా విచ్చలవిడిగా ఖనిజాల తవ్వకాలు జరిగితే పర్యావరణ పరిస్థితులకు పెను ముప్పు కలుగుతుందనే విషయాన్ని గ్రహించిన, కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ వెలువరించిన తాజా ఉత్తర్వును తక్షణమే ఉపసంహరించుకోవాలని స్టాలిన్ కోరారు.

జీఎస్టీలో రాష్ట్రాలకు

75 శాతం వాటా అవసరం

● స్పీకర్ అప్పావు



బెంగళూరులో శుక్రవారం జరిగిన సదస్సులో ప్రసంగిస్తున్న స్పీకర్

చెన్నై, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాలపై ఆర్థికపరంగా కేంద్ర ప్రభుత్వం పెత్తనం చెలాయించే ధోరణి విడనాడాలని, రాష్ట్రాలు ఆర్థికంగా పటిష్ఠంగా ఉంటే దేశం సుసంపన్నంగా ఉంటుందని స్పీకర్ అప్పావు పేర్కొన్నారు. బెంగళూరులో శుక్రవారం ఉదయం జరిగిన 11వ కామన్‌వెల్త్ పార్లమెంటరీ కమిటీ ప్రాంతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య సన్నిహిత సంబంధాలు కొనసాగాలంటూ రాజమన్నార్, సర్కారియా, వెంకటాచలయ్య, పూంఛ్ కమిటీలు చేసిన ఎన్నో ప్రతిపాదనలు ఆచరణకు నోచుకోలేదన్నది చేదునిజమన్నారు. గవర్నర్ల నియామకంలో ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు అభిప్రాయాలను తీసుకోవాలని ఎప్పడి నుంచో కోరుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని, జీఎస్టీ చట్ట సవరణ చేసినప్పుడు గుజరాత్ సీఎంగా ఉన్న నరేంద్ర మోదీ జీఎస్టీ అమలులోకి వస్తే రాష్ట్రాలు నిధుల కోసం కేంద్రం వద్ద యాచన చేసే పరిస్థితికి దిగజారుస్తుందని విమర్శించిన విషయాన్ని అప్పావు గుర్తు చేశారు. మోదీ ప్రధాని అయ్యాక జీఎస్టీ అమలు చేసి, రాష్ట్రాల వాటాను కుదించుకుంటూ పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకపై జీఎస్టీలో 75 శాతం వాటా కల్పిస్తే రాష్ట్రాలు అభివృద్ధి చెందగలుగుతాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

నేడు తిరుచ్చిలో విజయ్ ప్రచారం



విజయ్ పర్యటనకు పయనూరులోని ఆయన నివాసం వద్ద సిద్ధంగా ఉన్న వాహనం

ప్యారీస్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే)అధ్యక్షుడు, సినీనటుడు విజయ్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్న ప్రచారయాత్రకు శనివారం తిరుచ్చిలో శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా డిజైన్ చేయించిన 'ప్రచారలోగో'ను శుక్రవారం ఆ పార్టీ నేతలు ఆవిష్కరించారు. వచ్చే ఏడాదిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తొలి విడతగా తిరుచ్చి, అరియలూరు, పెరంబలూరు జిల్లాల్లో విజయ్ పర్యటించనున్నట్లు షెడ్యూల్ విడుదలైంది. పోలీస్‌శాఖ విజయ్ పర్యటనకు 23 షరతులు విధించి అనుమతులు మంజూరు చేసింది. ఎట్టి పరిస్థితిలోనూ రోడ్‌షోలో పాల్గొనరాదని, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగేలా సభలు నిర్వహించరాదు, విజయ్ ప్రచారవాహనానికి ముందు వెనుక, ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు వెళ్లరాదని పోలీస్‌శాఖ ఆదేశించింది. ఈ షరతులను అంగీకరించిన విజయ్ శనివారం ఉదయం 10 గంటలకు తిరుచ్చి మార్కెట్ ప్రాంతం నుంచి తన ప్రచార వాహనంతో పర్యటన ప్రారంభిస్తారు.

'పోతీస్' దుకాణాలపై ఐటీ పంజా

● ఏకకాలంలో 22 చోట్ల తనిఖీలు



ఐటీ తనిఖీ నేపథ్యంలో టీనగర్‌లో మూతపడిన పోతీస్ షోరూమ్

చెన్నై, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వస్త్ర దుకాణ సంస్థ పోతీస్ షోరూమ్‌లు, వాటి యజమానుల నివాసాలు, కార్యాలయాలలో ఆదాయపు పన్నుల శాఖ అధికారులు శుక్రవారం ఉదయం ఆకస్మిక దాడులు చేశారు. ఆ సంస్థ భారీగా పన్నుల ఎగవేతకు పాల్పడిందనే ఆరోపణల నేపథ్యంలో చెన్నై, తిరునల్వేలి, తూత్తుకుడి, తిరుచ్చి మదురై, కన్నియాకుమారి సహా 22 ప్రాంతాల్లో ఒకే సమయంలో సోదాలు జరిగాయి. ఈ దాడుల్లో సుమారు 200 మందికి పైగా ఐటీ అధికారులు పాల్గొన్నట్లు సమాచారం. టీనగర్ జీఎన్ చెట్టి రోడ్డులోని పోతీస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఉదయం వచ్చిన ఐటీ అధికారులు తనిఖీలు ప్రారంభించారు. కార్యాలయంలోని కంప్యూటర్లలో వివరాలను సేకరించారు.. అదే సమయంలో ఈస్ట్‌కోస్ట్‌రోడ్డులోని కానత్తూరు, నీలాంగరై తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న పోతీస్ సంస్థ యజమానుల బంగళాల్లో కూడా ఐటీ అధికారులు సోదాలు జరిపారు. చెన్నై రాజా అన్నామలైపురంలో క్రిసెంట్ వీధిలో నివసిస్తున్న పోతీస్ సంస్థ డైరెక్టర్ రమేష్, మేనేజర్ నివాసగృహాలు, కార్యాలయాల్లోనూ తనిఖీలు నిర్వహించారు. నీలాంకరై ప్రాంతంలోని పోతీస్ యజమాని నివాసం, క్రోంపేటలోని జౌళి దుకాణం, మాంబళం లేక్ వ్యూలో నివసిస్తున్న సూపర్‌వైజర్ ప్రదీప్ పిళ్లై ఫ్లాట్‌లో తనిఖీలు కొనసాగాయి. గత కొన్నేళ్లుగా పోతీస్ సంస్థ భారీ స్థాయిలో పన్నుల ఎగవేతకు పాల్పడిందనే ఆరోపణలు రావటంతో ఇటీవల చెన్నై సహా పలు ప్రాంతాల్లో సోదాలు జరిపారు. ఆ సోదాలలో పట్టుబడిన పత్రాల్లో లభించిన సమాచారంపై కొనసాగుతున్న విచారణలో భాగంగా ఈ దాడులు జరిగినట్లు తెలుస్తోంది. .

కోవైలో... : కోయంబత్తూరు టౌన్‌హాలు ఒప్పనకారవీధి, గాంధీపురం వెరైటీహాల్‌రోడ్డు ప్రాంతాల్లో ఉన్న పోతీస్ జౌళి దుకాణాల్లోనూ ఐటీ అధికారులు దాడులు చేశారు. శుక్రవారం ఉదయం ఎనిమిది కార్లలో వెళ్ళిన ఐటీ అధికారులు సోదాలు జరిపారు. ప్రతిచోటా దుకాణాలు, కార్యాలయాలు, నివాసాల్లోకి ఎవరినీ లోపలకు అనుమతించకుండా, లోపల ఉన్న వారిని బయటకు పంపకుండా ఈ సోదాలు జరిపారు. ఈ దాడుల సందర్భంగా చెన్నై సహా పలు నగరాల్లోని సంస్థల్లో పన్నుల ఎగవేతకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుని,, కంప్యూటర్లలోని కీలకమైన సమాచారాన్ని సేకరించినట్లు తెలుస్తోంది. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన ఈ సోదాలు సాయంత్రం ఆరుగంటల తర్వాత కూడా కొనసాగాయి. ఈ సోదాలు ముగిసిన తర్వాతే ఐటీ అధికారులు సమగ్రమైన సమాచారంతో అధికారికంగా ప్రకటన జారీ చేయనున్నారు.

నటి విజయలక్ష్మికి క్షమాపణ చెప్పాల్సిందే

● సీమాన్‌కు సుప్రీంకోర్టు హెచ్చరిక

ప్యారీస్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సినీనటి విజయలక్ష్మిని కించపరిచేలా వ్యాఖ్యానించిన నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే)ప్రధాన ఆర్గనైజర్ సీమాన్ ఆమెకు క్షమాపణ చెప్పాల్సిందేనని సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. తనకు వ్యతిరేకంగా విజయలక్ష్మి సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కేసు విచారణకు స్టే విధించాలని కోరుతూ సీమాన్ దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం మళ్లీ విచారణకు వచ్చింది. అప్పుడు విజయలక్ష్మి తరుపు హాజరైన న్యాయవాది గతంలో జరిగిన విచారణలో రాజీ చర్చలు జరపాలని న్యాయస్థానం ఆదేశించిందని, అయితే ఆ రోజు సాయంత్రమే రాజీ కుదరదని సీమాన్ మీడియా ముందు ప్రకటించారని తెలిపారు. రాజకీయంగా పలుకుబడి ఉన్న సీమాన్ వల్ల తమ పిటిషనర్ విజయలక్ష్మికి ప్రాణహాని ఉందని, అందువల్ల ఆమెకు పోలీసు భద్రత కల్పించాలని కోరారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో ఉన్న నటి విజయలక్ష్మిని వివాహం చేసుకుంటానని నమ్మించి 2007 నుండి 2011 వరకు తాళికట్టకుండా ఆమెతో సహజీవనం చేశారని ఆమె తరపు న్యాయవాది అత్యున్నత న్యాయస్థానానికి వివరించారు. ఇరు తరుపు వాదనలు విన్న అనంతరం విజయలక్ష్మిని కించపరిచేలా మాట్లాడిన సీమాన్‌ను న్యాయస్థానం తీవ్రంగా ఖండించింది. విజయలక్ష్మిని క్షమాపణ కోరుతూ ఈ నెల 24వ తేదీలోపు పిటిషన్ దాఖలు చేయాలని, లేకుంటే అరెస్టుపై ఇచ్చిన స్టే ఉత్తర్వులను రద్దుచేయాల్సివస్తుందని హెచ్చరించిన సుప్రీంకోర్టు ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 24కు వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

నవంబర్‌లో రాహుల్‌గాంధీ పర్యటన



చెన్నై, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నవంబర్‌లో రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఇటీవల రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో తిరునల్వేలిలో నిర్వహించిన పార్టీ మహానాడు విజయవంతం కావటంతో నవంబర్‌లో గ్రామకమిటీలతో భారీ స్థాయిలో మహానాడు జరపాలని టీఎన్‌సీసీ నాయకులు భావిస్తున్నారు. ఈ మహానాడును, చెన్నై లేదా తిరుచ్చిలో జరిపే అవకాశముంది. ఈ మహానాడుకు రాహుల్ గాంధీ వస్తారని, మహానాడులో సుమారు రెండు లక్షల మంది కార్యకర్తలను తరలించనున్నామని టీఎన్‌సీసీ నేతలు పేర్కొన్నారు.

16న బీజేపీ కేంద్ర కమిటీ సమావేశం

● రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్



ప్యారీస్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కేంద్ర కమిటీ సమావేశం ఈ నెల 16న నగరంలో జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ శుక్రవారం ప్రకటించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలకు తమ పార్టీ అన్ని విధాలా సిద్ధమవుతోందని, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తమ కూటమికి అధ్యక్షుడిగా వ్యవహరిస్తారన్నారు. కూటమిలోని పార్టీల విజయానికి చేపట్టాల్సిన ప్రచారం, గెలుపు అవకాశాలున్న నియోజకవర్గాలు, అభ్యర్థుల ఎంపిక, బూత్ కమిటీల నియామకం తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించినట్లు తెలిపారు. పార్టీ కేంద్ర కమిటీ సమావేశం మంగళవారం ప్రిసీడియం కార్యదర్శి సంతోష్ అధ్యక్షతన జరగనుందని, ఇందులో రాష్ట్ర, జాతీయ పార్టీ నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

తిరుప్పూర్‌ను డాలర్ సిటీగా అభివృద్ధి చేస్తా

● ఈపీఎస్ హామీ



సమావేశంలో మాట్లాడుతున్న ఈపీఎస్

ప్యారీస్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు అధికంగా ఉన్న తిరుప్పూర్‌ను అన్నాడీఎంకే అధికారంలోకి వచ్చాక డాలర్ సిటీగా అభివృద్ధి పరిచేందుకు చర్యలు చేపడతామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తిరుప్పూర్ వాసులకు హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని 'మక్కలై కాప్పోం -తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంలో ప్రచారయాత్ర చేపట్టిన ఈపీఎస్ శుక్రవారం తిరుప్పూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. బనియన్ కంపెనీలు, మరమ్మగ్గాల యజమానులు, రైతులు, స్టీలు, రాగి, ఇత్తడి పాత్రల తయారీదారులు, అద్దకపు పరిశ్రమల యజమానులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొని ఈపీఎస్‌కు తమ కోరికలతో కూడిన వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మాట్లాడుతూ.. రాష్ట్రం నుంచే కాకుండా ఉత్తరాది నుంచి ఉపాధి కోసం వచ్చిన లక్షలాది మంది కార్మికులకు ఉద్యోగావకాశాలు కల్పించి ఆదుకుంటున్న తిరుప్పూర్ పరిస్థితి ప్రస్తుతం అస్తవ్యస్తంగా మారిందని, పరిశ్రమలకు రకరకాల పేర్లతో తిరుప్పూర్ కార్పొరేషన్, డీఎంకే ప్రభుత్వం విధించిన పన్నుల వల్ల ఇక్కడ పరిశ్రమలు నిర్వహించలేక నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ముఖ్యంగా అమెరికా విధించిన 50శాతం పన్ను వల్ల నష్టపోయిన ఎగుమతిదారులకు రాయితీలు కల్పించాలని కోరుతూ కేంద్రప్రభుత్వానికి అన్నాడీఎంకే తరుపున పంపించిన లేఖకు త్వరలోనే సత్ఫలితాలు వస్తాయన్నారు. ఈ సభలో 27 సంఘాలకు చెందిన పరిశ్రమల ప్రతినిధులు తనకు వినతిపత్రాలను సమర్పించారని, వీటిని తాము అధికారంలోకి వచ్చాక అమలుపరుస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మాజీ డిప్యూటీ స్పీకర్ పొల్లాచ్చి జయరామన్, మాజీ మంత్రులు ఎస్పీ వేలుమణి, ఓఎస్. మణియన్, కడంబూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేపాల్ నుంచి సురక్షితంగా వచ్చిన తమిళులు

పెరంబూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నేపాల్ పర్యటనకు వెళ్లిన 116 మంది తమిళులు సురక్షితంగా తిరిగొచ్చారని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. అల్లర్లతో అట్టుడుకుతున్న నేపాల్‌లో చిక్కుకున్న తమిళుల పరిస్థితి, వారికి అవసరమైన సహాయాలు అందించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాలు జారీచేశారు. సీఎం ఆదేశాలతో ఢిల్లీలోని తమిళనాడు హోంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశారు. భారత విదేశాంగ శాఖ, నేపాల్‌లోని భారత దౌత్య కార్యాలయాల అధికారులను తమిళనాడు హోం అధికారులు సంప్రదించారు. నేపాల్‌కు విహార యాత్రకు వెళ్లిన రాష్ట్రానికి చెందిన 116 మంది సురక్షితంగా గురువారం దేశానికి చేరుకున్నారు. అలాగే, నేపాల్‌లో చిక్కుకున్న తమిళులు తమ వివరాలు తెలియజేసేలా, నేపాల్ చిక్కుకున్న వారి వివరాలను వారి కుటుంబ సభ్యులు తెలియజేసేలా ఢిల్లీ తమిళనాడు హోంను 011-24193300 అనే నెంబరు, 9289516712 (వాట్సాప్ నెంబరు), tnhouse@tn.gov.in అనే వెబ్‌సైట్, prcofficetnh@gmail.com ఈ-మెయిల్‌ను సంప్రదించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలో తెలిపింది.



దేహదానానికి సంబంధించిన పత్రాలను సామువేల్‌రాజ్‌కు అందజేస్తున్న వి.శంకర్ ఆయన కుటుంబ సభ్యులు

సీతారాం ఏచూరికి

ఘననివాళి

● దేహదానానికి అపూర్వ స్పందన

● 1586 మంది దరఖాస్తుల సమర్పణ



సీతారాం నివాళి సభలో ప్రసంగిస్తున్న బాలకృష్ణన్

చెన్నై, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నేత సీతారామ్ ఏచూరి ప్రథమ వర్థంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ శాఖా కార్యాలయాలలో దేహదాన కార్యక్రమాలు చేపట్టి ఆ దివంగత నేతకు ఘననివాళులర్పించారు. చెన్నై సహా పలు నగరాల్లోని సీపీఎం కార్యాలయాల్లో సీతారామ్ ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీ నాయకులు, కార్యకర్తలు పుష్పాంజలి ఘటించారు. రాష్ట్ర కమిటీ కార్యదర్శి షణ్ముగం అధ్యక్షతన నగరంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన నివాళి కార్యక్రమంలో రాష్ట్రకమిటీ మాజీ కార్యదర్శి కే బాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయనలాగే దేహదానం చేయాలని ఇచ్చిన పిలుపునకు అపూర్వ స్పందన లభించిందని తెలిపారు. శుక్రవారం సాయంత్రం వరకు అందిన సమాచార ప్రకారం చెన్నై సహా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పార్టీ కార్యాలయాల వద్ద ఏర్పాటైన నివాళి కార్యక్రమాల్లో 1586 మంది దేహదానం చేయడానికి అంగీకార పత్రాలను సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.శంకర్, ఆయన సతీమణి గీత, కుమార్తె డాక్టర్ శోభనా, కుమారుడు ఎస్‌జీ సిద్ధన్ దేహదానం చేస్తామని అంగీకార పత్రాలను సమర్పించారు. పార్టీ నేతలు వాసుకి, పి.సంపత్, కే సాముVేల్‌రాజ్, స్వామినాధన్, ఎస్.కన్నన్, ఎం.రామకృష్ణన్, ఆర్ వేల్‌మురుగన్, జి.సెల్వ, పి.సుందరరాజన్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా అడయార్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. **ఆ ప్రాంతాల వివరాలు...** హరేయమ్మన్ ఆలయ వీధి, వన్నాదురై, జయరామ్ అవెన్యూ, రామస్వామి అవెన్యూ, అపరంజి అవెన్యూ, ఎస్బీఐ కాలని, బీసెంట్ నగర్, శాస్త్రినగర్ 7 నుంచి 13 క్రాస్ వీధులతో పాటు 1వ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

15న 'అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్' ప్రారంభం

పెరంబూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో తొలిసారిగా ఈరోడ్-జోగ్బాని-ఈరోడ్ మధ్య నడుపనున్న అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 15న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... నెం.06602 జోగ్బాని-ఈరోడ్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రధాని మోదీ ఈ నెల 15న మధ్యాహ్నం 3.30 గంటలకు జోగ్బానిలో జెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ రైలు నాగ్‌పూర్, బల్హార్ష, ఒంగోలు, గూడూరు, నాయుడుపేట, పెరంబూర్, అరక్కోణం, కాట్పాడి, జోలార్‌పేట, సేలం మీదుగా ఈ నెల 18వ తేది ఉదయం 7 గంటలకు ఈరోడ్ చేరుకుంటుందన్నారు. మరుమార్గంలో రైలు బయల్దేరే సమయంపై త్వరలో అధికారిక ప్రకటన విడుదల చేయనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

ఐటీఐలో 30 వరకు అడ్మిషన్లు

పెరంబూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుత విద్యా సంవత్సరం ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 30వ తేది వరకు అవకాశం కల్పించారు. తమిళనాడు ఉపాధి కల్పన, శిక్షణ శాఖ పరిధిలో 132 ప్రభుత్వ ఐటీఐలు, 311 ప్రైవేటు ఐటీఐలున్నాయి. 2025-26 విద్యా సంవత్సరానికి ఐటీఐ కోర్సుల అడ్మిషన్లు గత నెల 30వ తేదీతో ముగిశాయి. విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు అడ్మిషన్ గడువు ఈ నెల 30వ తేది వరకు పొడిగించారు. శిక్షణలో చేరేందుకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. శిక్షణలో చేరిన వారికి ప్రోత్సాహక వేతనంగా నెలకు రూ.750,ఉచితంగా సైకిల్, యూనిఫాం, షూ, శిక్షణకు సంబంధించిన పరికరాలు, బస్ పాస్ అందజేస్తారు. మరిన్ని వివరాలకు 9499055642, 9499055618 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

రాయపేట ప్రభుత్వాసుత్రి పోస్టుమార్టం స్థలం మార్పు

పెరంబూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాయపేట ప్రభుత్వాసుపత్రిలోని పోస్టుమార్టం స్థలం మార్పు చేసినట్లు ఆసుపత్రి అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలోని పోస్టుమార్టం గదికి ఏసీ సదుపాయం కల్పిస్తున్నారు. ఈ కారణంగా, రాయపేట ప్రభుత్వాసుపత్రిలో మృతిచెందిన వారికి తాత్కాలికంగా కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్ళి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

'తమిళనాడు జీడిపప్పు బోర్డు' ఏర్పాటు

పెరంబూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జీడిపప్పు విస్తీర్ణం, ఉత్పత్తి మరింత పెంచేలా, జీడిపప్పు పరిశ్రమలో పాల్గొన్న రైతులు, కార్మికుల ప్రయోజనాలు కాపాడేలా 'తమిళనాడు జీడిపప్పు బోర్డు' ఏర్పాటుచేసినట్లు వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయం ఉత్పత్తి పెంచడం, వ్యవసాయ ఉత్పత్తులకు నాణ్యమైన ధరల నిర్ధారణ, రైతుల సంక్షేమం చేపడతామని గత శాసనసభలో వ్యవసాయం బడ్జెట్‌లో తెలిపారు. ఈ క్రమంలో, రాష్ట్రంలో 'తమిళనాడు జీడిపప్పు బోర్డు' ఏర్పాటుకు ఆమోదించిన ప్రభుత్వం, ఆ బోర్డుకు రూ.10 కోట్లు కేటాయించిందని మంత్రి పన్నీర్‌సెల్వం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆన్‌లైన్‌లో పెంపుడు జంతువుల లైసెన్స్

పెరంబూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువుల వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు చేసి ఉచితంగా లైసెన్స్ పొందవచ్చని తాంబరం కార్పొరేషన్ తెలిపింది. కార్పొరేషన్ పరిధిలోని 1 నుంచి 5 మండలాల్లో పెంపుడు జంతువులు సంరక్షిస్తున్న యజమానులు, పెంపుడు జంతువులకు టీకా వేసిన వివరాలను tcmcpublichealth.in pet animal register అనే వెబ్‌సైట్‌లో నమోదుచేసి లైసెన్స్ ఉచితంగా పొందవచ్చు. ఈ లైసెన్స్ ఒక ఏడాది చెల్లుబాటు అవుతుందన్నారు. లైసెన్స్ గడువు ముగిసిన వారు అదే వెబ్‌సైట్‌లో రెన్యువల్ చేసుకోవచ్చని తాంబరం కార్పొరేషన్ తెలిపింది.

స్టాన్లీ వైద్యకళాశాలలో సర్టిఫికెట్ కోర్సులు

పెరంబూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్టాన్లీ వైద్యకళాశాలలో మెడికల్ సర్టిఫికెట్ల కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. 2025-26 విద్యా సంవత్సరానికి ఎమర్జెన్సీ కేర్ టెక్నీషియన్, రెస్పిరేటరీ కేర్ టెక్నీషియన్, డయాలసిస్ టెక్నీషియన్, అనస్థీషియా టెక్నీషియన్, మెడికల్ రికార్డ్స్ టెక్నీషియన్, మల్టీ-డిసిప్లినరీ హాస్పిటల్ స్టాఫ్ తదితర సర్టిఫికెట్ కోసం సంవత్సరం కోర్సులు అందిస్తున్నారు. ఈ కోర్సుల్లో మొత్తం 393 సీట్లున్నాయి. మరిన్ని వివరాలకు https://stanleymedicalcollege.in/ అనే వెబ్‌సైట్, 9840505701 నెంబరు, stanleycollege19@ gmail.com అనే ఈ-మెయిల్ చిరునామాను సంప్రదించవచ్చని చెన్నై జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

18 నుంచి ఎంఎన్ఎం సమావేశాలు

పెరంబూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మక్కల్ నీది మయ్యం (ఎన్ఎంఎం) తమిళనాడు, పుదుచ్చేరి శాసనసభ ఎన్నికల సమీక్షా సమావేశం ఈ నెల 18 నుంచి 21వ తేది వరకు రాజా అన్నామలై పురంలోని ముత్తమిళ్ పేరవై టీఎన్ రాజరత్నం హాలులో జరుగనుంది. 18వ తేది ఉదయం చెన్నై, సాయంత్రం కాంచీపురం, 19వ తేది ఉదయం కోయంబత్తూర్, సాయంత్రం మదురై, 20వ తేది ఉదయం తిరునల్వేలి, సాయంత్రం తిరుచ్చి, 21వ తేది ఉదయం విల్లుపురం, సాయంత్రం సేలం, పుదుచ్చేయరి మండలాలకు చెందిన పార్టీ నిర్వాహకులు, శాఖా సభ్యులతో ఆ పార్టీ అధ్యక్షుడు కమల్ హాసన్ భేటీ కానున్నారు. నేతలు, కార్యకర్తల అభిప్రాయలు స్వీకరించి, తమిళనాడు, పుదుచ్చేరి ఎన్నికలకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముందని పార్టీ వర్గాలు తెలిపారు.

నాగై జాలర్లపై సముద్రపు దొంగల దాడి

● సెల్‌ఫోన్లు, జీపీఎస్ పరికరాలు దోపిడీ







గాయపడిన జాలర్లను ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు - గాయాలతో తిరిగొచ్చిన జాలర్లు

చెన్నై, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వేదారణ్యం ప్రాంతానికి 15 నాటికల్ మైళ్ల దూరంలో శుక్రవారం వేకువజామున సముద్రంలో చేపలు పడుతున్న నాగపట్టినంకు చెందిన నలుగురు జాలర్లపై శ్రీలంక సముద్రపు దొంగలు దాడి చేసి విలువైన వస్తువులను దోచుకెళ్ళారు. నాగపట్టినం జిల్లా సెరుదూరు వీటీపీ సునామీ క్వార్టర్స్ ప్రాంతంలోని వెన్నిలా అనే వ్యక్తికి చెందిన ఫైబర్ పడవలో బాలకృష్ణన్ (49), బీఎస్ఎన్ఎల్ సునామీ క్వార్టర్స్ ప్రాంతానికి చెందిన ఇడుంబన్ (47), రత్నం (25), గణేశన్ (55) అనే జాలర్లు ఈ నెల 10న సముద్రంలో చేపలవేటకు బయలుదేరారు. శుక్రవారం వేకువజామున వేదారణ్యానికి ఆగ్నేయ దిశగా చేపలుపడుతుండగా ఫైబర్ పడవలో వచ్చిన శ్రీలంక సముద్రపు దొంగలు జాలర్లను చుట్టుముట్టి దాడి జరిపి కత్తులు చూపి బెదరించి సెల్‌ఫోన్లు, జీపీఎస్ పరికరాలు, బ్యాటరీ, టార్చిలైట్లు, పడవలో చేపలను కూడా దోచుకెళ్ళారు. సముద్రపు దొంగల దాడిలో జాలర్లు బాలకృష్ణన్, ఇడుంబన్, గణేశన్ తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం ఉదయం తీరానికి చేరుకున్న ముగ్గురు జాలర్లను చికిత్స నిమిత్తం ఒరత్తూరు ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించారు.

మరో సంఘటన... : సెరుత్తూరు జాలరి గ్రామానికి చెందిన బృహదీశ్ (25), తిరిసెల్వం (44), సుందరవేల్ (30), శాంతకుమార్ (28), ఆంటోని రాజ్ అనే నలుగురు వేదారణ్యం సముద్రతీరానికి చేరువగానే సముద్రంలో చేపలపడుతుండగా శ్రీలంక సముద్రపు దొంగలు దాడి చేసి 200 కేజీల బరువైన వలలు, సెల్‌ఫోన్లు, బ్యాటరీలు, టార్చిలైట్లు, చార్జర్, పెట్రోల్, జీపీఎస్ పరికరాలను దోచుకెళ్ళారు. శుక్రవారం ఉదయం తీరానికి చేరుకున్న గాయపడిన బృహదీశ్, శాంతకుమార్ అనే జాలర్లు చికిత్స కోసం ఒరత్తూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు.

ఇంటికి అనుమతి నిరాకరణ

● గ్రామీణాభివృద్ధి శాఖ ఇంజనీర్‌పై ఫిర్యాదు



కేశవన్ కుటుంబ సభ్యులు

తిరుత్తణి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణ అనుమతులకు లంచం అడిగిన గ్రామాభివృద్ధిశాఖ ఇంజనీర్‌పై చర్యలు తీసుకోవాలంటూ తిరువలంగాడుకు చెందిన ఓ రైతు కుటుంబం రోడ్డెక్కింది. వివరాలిలా... తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడు సమీపంలోని దాసిరెడ్డి కండిగై గ్రామంలో వ్యవసాయం చేసుకుంటున్న కేశవన్ (42)అనే దివ్యాంగుడు నివసిస్తున్నాడు. ఈ నేపథ్యం 6 నెలల క్రితం వారికి 'కలైంజర్ కనవు ఇల్లం' పథకం ద్వారా అధికారులు ఇంటిస్థలం కేటాయించారు.. ఈ క్రమంలో ఇంటి నిర్మాణానికి ఏర్పాట్లు పూర్తి చేసుకున్న కేశవన్ నిర్మాణ అనుమతుల కోసం గ్రామాభివృద్ధిశాఖ ఇంజనీర్ కార్యాలయానికి వెళ్లగా ఇంటి ప్లానింగ్ తదితర పత్రాలను పరిశీలించిన ఇంజనీర్ ఏలుమలై రూ.10వేలు లంచంగా డిమాండ్ చేశారు. దివ్యాంగుడైన కేశవన్ రూ10వేలు లంచం ఇవ్వలేనని తన భార్య సరళతో కలిసి ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసినా ఫలింతం లేదని బాధితుడు వాపోతున్నాడు. ఈ నేపథ్యంలో, శుక్రవారం కుటుంబంతో కలిసి గ్రామాభివృద్ధిశాఖ కార్యాలయానికి వెళ్లి అభ్యర్థించారు. ఈ సందర్భంగా కేశవన్ తండ్రి అన్బరసన్ మాట్లాడుతూ 9 మంది కలిగిన తమ కుటుంబ భారం మొత్తం దివ్యాంగుడైన తన కొడుకుపై పడుతుందని, అప్పుచేసి ఇల్లు నిర్మించుకునే స్తోమత తమకు లేదని, గత వారం ఉంగళుడన్ స్టాలిన్ శిబిరంలో ఈ సమస్యపై ఫిర్యాదు చేస్తే ఇంజనీర్ ఏలుమలై నుండి బెదిరింపులు వచ్చాయని వాపోయాడు. దీనిపై అధికారులు స్పందించి తమ ఇంటికి అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

15 నుంచి మెట్రోరైలు వేళల్లో మార్పులు

పెరంబూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళని రైల్వేస్టేషన్ పైభాగంలో రెండో దశ నిర్మాణపనుల కారణంగా గ్రీన్ లైన్ మార్గంలో మెట్రో రైళ్ల వేళల్లో మార్పులు జరిగాయి. కోయంబేడు నుంచి అశోక్ నగర్ వరకు మెట్రోరైలు సేవల్లో ఈ నెల 15 నుంచి 19వ తేది వరకు తాత్కాలికంగా మార్పులు చేశారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు సెయింట్ థామస్ మౌంట్-అశోక్ నగర్ మెట్రో రైల్వేస్టేషన్ వరకు 14 నిమిషాలు, విమానాశ్రయం నుంచి అశోక్ నగర్ 14 నిమిషాల వ్యవధి, సెంట్రల్-కోయంబేడు మధ్య 7 నిమిషాలకు ఒక రైలు నడపనున్నారు. ఆ సమయంలో కోయంబేడు నుంచి అశోక్ నగర్ వరకు మెట్రో రైలు సేవలు తాత్కాలికంగా నిలిపివేయనున్నారు. ఆ సమయంలో ప్రయాణికుల సౌకర్యార్థం కోయంబేడు, అశోక్ నగర్ వరకు ఉదయం 5 నుంచి 6 గంటల వరకు 10 నిమిషాలకు ప్రత్యేక లింక్ బస్సు నడుపనున్నారు. ఉదయం 6 గంటల నుంచి యధావిధిగా మెట్రో రైలు సేవలు కొనసాగుతాయి. వింకోనగర్-సెంట్రల్-విమానాశ్రయం మార్గంలో ఎలాంటి మార్పులు లేవని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ఒక ప్రకటనలో తెలిపింది.

మెదడు నిర్జీవమైనా పలువురికి ప్రాణదానం



ముత్తుదొరైస్వామి (ఫైల్‌ఫొటో)

వేలూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మెదడు నిర్జీవమైన వ్యక్తి అవయవ దానంతో మరికొందరికి పునర్జన్మ లభించింది. తిరుపత్తూర్ జిల్లా అచ్చమంగళంలో ఈ నెల 10వ తేది ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ ముత్తుదొరైస్వామి (47) తలకు బలమైన గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం సీఎంసీ ఆస్పత్రిలో చేర్పించగా, అక్కడ చికిత్స ఫలించక గురువారం రాత్రి దొరైస్వామి మెదడు నిర్జీవమైనట్లు వైద్యులు నిర్ధారించారు. వైద్యుల సూచనలతో ఆయన అవయవాలు దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. దీంతో, ప్రత్యేక చికిత్స ద్వారా వెలికితీసిన గుండెను చెన్నై ఎంజీఎం ఆస్పత్రికి, ఒక కిడ్నీ రాణిపేట సీఎంసీకి, మరో కిడ్నీ చెన్నైలోని ప్రైవేటు ఆసుపత్రి, పేగులు రాజీవ్ గాంధీ ప్రభుత్వాసుపత్రి, నేత్రాలు సీఎంసీ ఆసుపత్రి అందజేసినట్లు వైద్యులు తెలిపారు. కాగా, మృతుడి కుటుంబానికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

అరుంధతీయులు... రాజ్యాధికారం దిశగా నడవాలి

● టామ్స్ వ్యవస్థాపకులు గొల్లపల్లి ఇశ్రాయేలు



ఎమ్మెల్యే ఈశ్వరన్‌ను సత్కరిస్తున్న గొల్లపల్లి ఇశ్రాయేలు, మొండెం కృష్ణమూర్తి తదితరులు

ప్యారీస్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జనాభాలో 25శాతానికి పైగా ఉన్న అరుంధతీయులను రాజకీయ నాయకులు ఓటుబ్యాంకుగానే పరిగణిస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంఘాలన్నీ ఏకమై రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని తమిళనాడు ఆదిఆంధ్ర అరుంధతీయ మహాసభ (టామ్స్) వ్యవస్థాపకులు డాక్టర్ గొల్లపల్లి ఇశ్రాయేలు పిలుపునిచ్చారు. రాయపేటలో గురువారం సాయంత్రం అరుంధతీయ సమాజ మార్పు కోసం కల్పించాల్సిన అవసరాలు, చేపట్టాల్సిన చర్యలపై చర్చిందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సదస్సులో ముఖ్యఅతిథిగా కొంగు మక్కల్ దేశీయ కట్చి అధ్యక్షులు, ఎమ్మెల్యే ఈఆర్.ఈశ్వరన్, ప్రత్యేక అతిథులుగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు ఐవీ.మణివన్నన్, గోవిందరాజ్, అరుంధతీ పార్టీ అధ్యక్షుడు పి.పురుషోత్తం, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) అధ్యక్షులు కర్రా లోకేష్‌కుమార్, టీఏవైఎం వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్టీ కల్యాణసుందరం, స్వతంత్రనగర్ ఆదిఆంధ్ర ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షులు మొండెం కృష్ణమూర్తి సహా పలు అరుంధతీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ముందుగా సభాధ్యక్షుడు గొల్లపల్లి ఇశ్రాయేలు మాట్లాడుతూ, రాష్ట్రంలో పలు జిల్లాల్లో అరుంధతీయులు, ఆదిఆంధ్రులు, మాదిగ కులాల పేర్లతో నివసిస్తున్నవారు విద్య, ఉద్యోగ రంగాల్లో లబ్ధి పొందేలా ఎస్సీలకు కల్పించిన 18శాతం రిజర్వేషన్లలో అంతర్గత రిజర్వేషన్ కల్పించాలని టామ్స్‌తో పాటు పలు అరుంధతీయ సంఘాలు చేపట్టిన ప్రయత్నాలు ఫలించాయన్నారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు అరుంధతీయులకు 6 శాతం రిజర్వేషన్ పెంచే దిశగా రాష్ట్రప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఈశ్వరన్ మాట్లాడుతూ, అరుంధతీయులకు కల్పించాల్సిన రాయితీల గురించి తాను అసెంబ్లీ సమావేశాల్లో పలుమార్లు ప్రస్తావించానని, రాష్ట్ర జనాభాలో అధిక ఓటు బ్యాంకు కలిగిన ఈ సమాజానికి ప్రభుత్వం అండగా నిలవాలని ఆకాంక్షించారు. 3 శాతం రిజర్వేషన్ అమలు, తాడ్కో సంస్థ పనితీరు పర్యవేక్షించేందుకు మోనటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కర్రా లోకేష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'సింహం తోక కోతులు' సంరక్షణకు రూ.కోటి

పెరంబూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సింహం తోక కోతులు, ముళ్ల పంది తదితర అరుదురైన జంతువుల సంరక్షణ ప్రాజెక్ట్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ. కోటి కేటాయించిందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ విషయమై అటవీ శాఖ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కోయంబత్తూర్ జిల్లా ఆనైమలై పులుల శరణాలయం తదితర ప్రాంతాల్లో సింహం తోక కోతులు అధికంగా ఉన్నాయన్నారు. ఈ కోతుల సంఖ్య తెలుసుకునేలా కొద్ది రోజుల క్రితం సర్వే చేపట్టామని, ఆ ప్రకారం, సింహం తోక కోతుల సంరక్షణకు ప్రత్యేక ప్రాజెక్ట్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేశామని తెలిపారు. అలాగే, నీలగిరి జిల్లా అటవీ ప్రాంతాల్లో ముళ్ల పంది కనిపిస్తుందని, వీటి సంఖ్య క్రమక్రమంగా తగ్గుతోందన్నారు. ప్రజల మూఢనమ్మకం, అజ్ఞానం కారణంగా వీటిని చంపుతున్నారన్నారు. ఈ క్రమంలో, సింహం తోక కోతులు, హైనా తదితరాలు రక్షించే ప్రాజెక్ట్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ. కోటి కేటాయించిందని తెలిపారు.

రాజకీయ పార్టీలతో ఎన్నికల సంఘం సమావేశం

పెరంబూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాకు సంబంధించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని ఎన్నికల సంఘం జిల్లా ఎన్నికల అధికారులకు ఆదేశించింది. రాష్ట్రంలో ప్రస్తుత ఓటర్ల జాబితాకు, 20 సంవత్సరాల క్రితం ప్రచురించిన ఓటరు జాబితాకు మధ్య ఏవైనా వ్యత్యాసాలుంటే సరిచేసే సవరణ ప్రక్రియ జరుగుతోంది. ఈ పనులను ఈ నెల 26వ తేదిలోగా పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అలాగే, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలతో జిల్లా ఎన్నికల అధికారులు సమావేశాలు నిర్వహించాలని, ఈ సమావేశాల అనంతరం ఓటర్ల జాబితా సవరణ పనులకు సంబంధించి ప్రధాన ఎన్నికల అధికారి నేతృత్వంలో సమావేశాలు జరుగుతాయని ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఎగ్మూర్ నుంచే మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లు

పెరంబూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఎగ్మూర్-మదురై పాండియన్ ఎక్స్‌ప్రెస్ సహా మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లు యధావిధిగా ఎగ్మూర్ నుంచి బయల్దేరుతాయని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌లో రూ.734.91 కోట్లతో చేపట్టిన పునరుద్ధరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్లాట్‌ఫారంల ఆధునికీకరణ కారణంగా, ఎగ్మూర్-తిరుచ్చి రాక్‌ఫోర్ట్ ఎక్స్‌ప్రెస్, ఎగ్మూర్-మదురై పాండియన్, ఎగ్మూర్-తిరుచ్చి చోళన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ నెల 11 నుంచి తాంబరం నుంచి నడుపుతున్నారు. పండుగల సీజన్ కావడంతో ఈ మార్పులు ఉపసంహరించుకోవాలనే ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు రాక్‌ఫోర్ట్, పాండియన్, చోళన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు యధావిధిగా ఎగ్మూర్ నుంచి బయల్దేరనున్నాయి. అదే సమయంలో, ఎగ్మూర్-రామేశ్వరం సేతు ఎక్స్‌ప్రెస్, ఎగ్మూర్-రామేశ్వరం ఎక్స్‌ప్రెస్ రైలు తాంబరం నుంచి ఎగ్మూర్-ముంబై సీఎంఎస్‌టీ ఎక్స్‌ప్రెస్ చెన్నై బీచ్ నుంచి ఈ నెల 11 నుంచి నవంబరు 10వ తేది వరకు నడుస్తాయని దక్షిణ రైల్వే ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే.

తాంబరం నుంచి ఉళవన్, ఆనందపురి

చెన్నై ఎగ్మూర్-తంజావూరు-చెన్నై ఎగ్మూర్ (నెం.16866/16865) ఉళవన్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17వ తేది నుంచి, నెం.20636/20635 కొల్లం-చెన్నై ఎగ్మూర్-కొల్లం ఆనందపురి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 18 నుంచి నవంబరు 10వ తేది వరకు ఎగ్మూర్‌కు బదులుగా తాంబరం నుంచి బయల్దేరనున్నాయని దక్షిణ రైల్వే తెలిపింది.

విద్యుత్ రైళ్లలో సీట్లపై కాళ్లు పెడితే శిక్ష

● హెచ్చరించిన దక్షిణ రైల్వే



ప్యారీస్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి శివారు ప్రాంతాలకు నడుపుతున్న విద్యుత్ సబర్బన్ రైళ్లలో ప్రయాణం చేస్తున్నవారు ఎదురుగా వున్న సీట్లపై కాళ్లు పెడితే చట్టపరమైన చర్యలుంటాయని దక్షిణ రైల్వే హెచ్చరించింది. నగరం నుంచి ప్రతిరోజు తిరువళ్లూరు, ఆవడి, అరక్కోణం, తిరుత్తణి, గుమ్మిడిపూండి, సూళ్లూరుపేటలకు నడుపుతున్న విద్యుత్ సబర్బన్ రైళ్లలో లక్షలాది మంది ప్రయాణం చేస్తున్నారు. అయితే ప్రయాణికుల్లో కొంతమంది చేసే అనాగరిక చర్యల కారణంగా మిగతా ప్రయాణికులు ఇబ్బందులకు గురవడంతో పాటు ప్రమాదాల బారిన పడుతున్నారు. రైళ్లలో ఇలాంటి అనాగరిక చర్యలు జరగకుండా పూర్తిస్థాయిలో అడ్డుకునేలా రైల్వే శాఖ ప్రయాణికులకు కొన్ని షరతులు విధించింది. ప్రయాణికులు రైళ్లలో తమకు ఎదురుగా ఉన్న ఖాళీ సీట్లలో కాళ్లు పెట్టరాదని, తమ బంధువులు, మిత్రుల కోసం సీట్లు ఆక్రమించుకోరాదని, ముఖ్యంగా బోగీల ఎంట్రన్స్‌లో కూర్చోరాదని, మిగతా ప్రయాణికులు ఎక్కి దిగేందుకు ఆటంకం కలిగించరాదని, కదులుతున్న రైలులో ఎక్కడం, దిగడం వల్ల ప్రమాదంలో చిక్కుకుంటారని దక్షిణ రైల్వే సూచించింది. ఈ తాజా నిబంధనలను అతిక్రమించే ప్రయాణికులపై చట్టపరమైన చర్యలుంటాయని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో హెచ్చరించింది.

రాందాస్, అన్బుమణి వర్గీయుల బాహాబాహీ

పెరంబూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దిండివనంలో రాందాస్-అన్బుమణి వర్గీయులు పరసర్పదాడులకు పాల్పడ్డారు. పీఎంకే నిర్వహణ అధ్యక్షుడు పదవి, ప్రాథమిక సభ్యత్వం నుంచి అన్బుమణిని తొలగిస్తూ పీఎంకే అధ్యక్షుడు రాందాస్ ప్రకటన విడుదల చేశారు. ఈ కారణంగా రాందాస్, అన్బుమణి వర్గాల మధ్య విభేదాలు పొడచూపాయి. ఈ నేపథ్యంలో, విల్లుపురం-దిండివనం రోడ్డులోని ఫ్లై ఓవర్ సమీపంలోని వన్నియర్ సంఘ కార్యాలయంలో ఈ నెల 17వ తేది వన్నియర్లు రిజర్వేషన్ కోరుతూ చేపట్టిన పోరాటంలో మృతిచెందిన 21 మందికి నివాళులర్పించే కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి అన్బుమణి హాజరవుతారని ప్రకటించారు. దీంతో, రాందాస్ వర్గీయులు వన్నియర్ సంఘం కార్యాలయానికి తాళం వేశారు. ఈ విషయం తెలుసుకున్న అన్బుమణి వర్గీయులు అక్కడకు చేరుకుని తాళాలు బద్దలుకొట్టేందుకు యత్నించారు. దీంతో, ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం జరిగి, ఒకానొక దశలో తోపులాట జరిగింది. సమాచారం అందుకున్న దిండివనం పోలీసులు ఇరువర్గాలను శాంతపరిచారు. అలాగే, మళ్లీ ఇరువర్గాలు గొడవలకు దిగకుండా కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

నగదు మోసం కేసులో ట్రస్టీ అరెస్ట్



అరెస్టయిన రవిచంద్రన్

ప్యారీస్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగదు మోసం కేసులో పుదుకోట జిల్లా విరాలిమలై సమీపంలోని కుడిమియాన్‌మలైకు చెందిన సవరిముత్తు ట్రస్టీ వ్యవస్థాపకుడు రవిచంద్రన్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు సీబీసీఐడీ తెలిపింది.. తన తండ్రి పేరుతో ఏర్పాటు చేసిన ట్రస్ట్ నడుపుతున్న రవిచంద్రన్ తమ సంస్థలో నగదు డిపాజిట్ చేసినవారికి అధిక వడ్డీ ఇస్తామని ప్రకటించడంతో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల వందలాది మంది ఉద్యోగులు పెద్దమొత్తంలో నగదు డిపాజిట్ చేశారు. ఈ రకంగా రూ.వేల కోట్లు వసూలు చేసుకున్న రవిచంద్రన్ హఠాత్తుగా ట్రస్ట్ బోర్డు తిప్పేసి పరారైనట్లు బాధితులు పుదుకోట సీబీసీఐడీ డీఎస్పీ కల్పనాదత్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాలతో ఏర్పాటైన ప్రత్యేక బృందం పుదుకోట ప్రాంతంలో ఓ ఇంట్లో తలదాచుకున్న రవిచంద్రన్‌ను శుక్రవారం ఉదయం అరెస్టు చేసి జరిపిన విచారణలో అతనిపై ఇంతకు ముందే 10కి పైగా నమోదైన నగదు మోసం కేసులు పెండింగులో ఉన్నట్లు తెలిసింది.

కోయంబేడులో బస్సు చోరీ

● ఒడిశా యువకుడి అరెస్టు



రాష్ట్ర రవాణా సంస్థ బస్సు నడుపుతున్న జ్ఞానరాజ్ సాహు

చెన్నై, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు బస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి తిరుపతి వెళ్లే ఆర్టీసీ బస్సు చోరీకి గురైంది. ఈ విషయమై బస్‌స్టేషన్ మేనేజర్ రామ్‌సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని అక్కడి సీసీ ఫుటేజీ పరిశీలించారు. ఆ వీడియోలో గుర్తు తెలియని వ్యక్తి బస్సు నడుపుకుంటూ వెళ్తుండటం కనిపించింది. వెంటనే పోలీసులు తిరుపతి, నెల్లూరు వైపున్న ఆంధ్రప్రదేశ్ పోలీసుస్టేషన్లకు బస్‌నెంబర్ తదితర వివరాలను పంపి అప్రమత్తం చేశారు. చివరకు ఆ బస్సు ఆంధ్రపదేశ్‌లోని నెల్లూరు వద్ద వెళుతుండగా అక్కడి పోలీసులు ఆపి, బస్‌ను నడిపిన ఒడిశాకు చెందిన జ్ఞానరాజ్ సాహు (24) అనే యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత చెన్నై నుండి వెళ్ళిన పోలీసులు ఆ బస్సును స్వాధీనం చేసుకుని, బస్సు అపహరించుకెళ్ళిన జ్ఞానరాజ్ సాహును అరెస్టు చేశారు. పోలీసులు జరిపిన విచారణలో జ్ఞానరాజ్ సాహు పుట్టు మూగ, చెవిడివాడని వెల్లడైంది.

నగల దుకాణంలో చోరీ యత్నం

● మహిళ అరెస్ట్



దుకాణ యజమానిని కత్తితో బెదిరిస్తున్న దృశ్యం (అంతర్ చిత్రంలో) నిందితురాలు జయచిత్ర

పెరంబూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పరదా ధరించిన మహిళ, నగల దుకాణ యజమానిని కత్తితో బెదిరించి చోరీ చేసేందుకు యత్నించిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. తిరువొత్తియూర్ కాలడిపేట మార్కెట్ ప్రాంతానికి చెందిన దేవరాజ్ (65) నగల దుకాణం నడుపుతున్నాడు. గురువారం మధ్యాహ్నం దుకాణానికి పర్దా ధరించి వచ్చిన మహిళ నగలు, బ్రాస్‌లైట్, చెవిదుద్దులు కలిసి 5 సవర్లు తీసుకుంది. నగలకు డబ్బులు ఇవ్వాలని దేవరాజ్ కోరగా, తన భర్త వచ్చి ఇస్తారని తెలిపిన మహిళ, చాలాసేపు దుకాణంలో కూర్చుంది. మధ్యాహ్నం భోజన సమయం కావడంతో దుకాణం మూస్తున్నట్లు దేవరాజ్ చెప్పగా, ఆ మహిళ వెంటనే తనతో తెచ్చిన కత్తితో అతడిని బెదిరించింది. ఊహించని ఘటనకు దిగ్భ్రాంతి చెందిన దేవరాజ్, దుకాణంలో ఉన్న తన భార్య, కుమారుడు సాయంతో మహిళను బంధించాడు. సమాచారం అందుకున్న తిరువొత్తియూర్ పోలీసులు, అక్కడకు చేరుకుని మహిళను అరెస్ట్ చేశారు. విచారణలో... ఆమె తిరువొత్తియూర్ కాలడిపేట పశ్చిమ మాడ వీధికి చెందిన జయచిత్ర (45)గా గుర్తించారు. అలాగే, తాను ఆర్‌ఏ పురంలోని ఓ కంపెనీలో రూ.30 వేల వేతనంతో పనిచేస్తున్నానని, తన భర్త రాజేష్ సివిల్ ఇంజనీర్‌గా పనిచేస్తుండగా, తమకు ఒక కుమార్తె ఉందని తెలిపింది. భర్తకు తెలియకుండా తాను సుమారు రూ.4 లక్షలు అప్పు చేసి, అప్పులిచ్చిన వారి ఒత్తిడి కారణంగా చోరీ చేయాలని నిర్ణయించుకొని, సామాజిక మాధ్యమాల ద్వారా చోరీ చేసే విధానం తెలుసుకుని, పర్దా వేసుకుని మిరపపొడి, కత్తితో ఈ చర్యలకు పాల్పడినట్లు జయచిత్ర పోలీసులకు తెలిపింది. ఆమె చెప్పింది వాస్తవమా? ఆమెపై మరేవైనా చోరీ కేసులు ఉన్నాయా? అంటూ పోలీసులు విచారిస్తున్నారు.

కాంట్రాక్టర్ ఇంట్లో సీబీసీఐడీ తనిఖీలు

వేలూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాంట్రాక్టర్ ఇంట్లో సీబీసీఐడీ పోలీసులు తనిఖీలు చేపట్టారు. కాట్పాడి సమీపం క్రిస్టియన్‌పేటకు చెందిన జయరాజ్, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు కాంట్రాక్ట్ పనులు చేస్తుంటాడు. ఆయన ఇరుడియమ్ విక్రయిస్తున్నారనే ఫిర్యాదుతో, చెన్నై సీబీసీఐడీ పోలీసులు శుక్రవారం జయరాజ్ ఇంట్లో తనిఖీలు చేపట్టి, కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

తిరుపత్తూర్ జిల్లాలో...

తిరుపత్తూర్ జిల్లా అంబూరు జలాల్ నగర్‌కు చెందిన అబ్రోస్ అహ్మద్ తోళ్ల కర్మాగారం నడుతున్నాడు. ఆయన జీఎస్టీ చెల్లించలేదని పేర్కొంటూ చెన్నైకి చెందిన జీఎస్టీ అధికారులు 12 మంది రెండు గ్రూపులుగా విడిపోయి అహ్మద్ ఇల్లు, కర్మాగారం సహా 12 ప్రాంతాల్లో తనిఖీ చేపట్టి, విలువైన ఆస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

కేవీ పాఠశాలలో కరాటే పోటీలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నటుడు రియాజ్‌ఖాన్

తిరుత్తణి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేట కోరకుప్పం కేవీ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు కరాటే పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీనటుడు రియాజ్‌ఖాన్ హాజరయ్యారు. ఇందులో ఆర్కేపేట పరసరాల్లోని 8 పాఠశాలల నుండి సుమారు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కరాటే పోటీ విజేతలకు ఆయన చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గోమతి, వైస్ ప్రిన్సిపాళ్లు నస్రీన్, నందిని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు, రేపు అడయార్‌లో వ్యర్థాల సేకరణ

పెరంబూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్ కస్తూరి రెసిడెన్షియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అడయార్, గాంధీ నగర్ కుమారమీనా ముత్తయ్య కళాశాలలో శని, ఆదివారాల్లో వ్యర్థాల సేకరణ చేపట్టనున్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, పాత బట్టలు, ఖాళీ పిల్ బాక్స్‌లు, ఎక్స్‌రే ఫిల్మ్‌లు, బూట్లు, పెన్నులు, పెన్సిల్ వంటి కార్యాలయ సామగ్రి, పాత వార్తా పత్రికలు, పగలని గాజు వంటి వస్తువులను ప్రజలు అందించవచ్చని అసోసియేషన్ నిర్వాహకులు జనని ఒక ప్రకటనలో తెలిపారు.



ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న చిత్ర బృందం

'శక్తి తిరుమగన్' స్టోరీ అర్థం కాలేదు

● విజయ్ ఆంటోని

తాను హీరోగా నటించిన 'శక్తి తిరుమగన్' స్టోరీ తనకు మొదట అర్థం కాలేదని, దర్శకుడు పలుమార్లు వివరించిన తర్వాత అందులోని సారాంశాన్ని గ్రహించానని హీరో విజయ్ ఆంటోనీ పేర్కొన్నారు. విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రానికి దర్శకుడు అరుణ్ ప్రభు. తృప్తి హీరోయిన్. ఇటీవల నగరంలో జరిగిన మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్‌లో చిత్రపరిశ్రమకు చెందిన పలువురు సినీ ప్రముఖులు పాల్గొని చిత్ర బృందాన్ని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో నేపథ్యగాయని శోభన చంద్రశేఖర్, నిర్మాత ధనుంజయన్, నటుడు అజయ్ దీషన్, నటి రియా, నటి, రిని, దర్శకులు శశి, సుశీంద్రన్, మిత్రన్ జవహర్, ప్రదీప్, ఆనంద్, ఆంథ్రో, ఆనంద్ కృష్ణన్, జోష్వా, వినాయక్, పెప్పిన్, నటుడు సెల్ మోహన్, నటి రాధతో పాటు చిత్ర హీరోయిన్ తృప్తి, ఇతర నటీనటులున్నారు. ఈ సందర్భంగా హీరో విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ 'ఇప్పటివరకు 19 చిత్రాల్లో హీరోగా నటించాను. కొన్ని చిత్రాల్లో గౌరవ పాత్రల్లో కనిపించాను. ఇది నాకు 25వ చిత్రం. వరుసగా మరికొన్ని చిత్రాల్లో నటించనున్నాను. శశి దర్శకత్వంలో రానున్న 'నూరుసామి' ఓ మంచి చిత్రంగా ఉంటుంది. నా సొంత బ్యానరులో చిత్రాలు నిర్మిస్తున్నాను. ఇంకా అనేక మందికి అవకాశాలు ఇవ్వనున్నాను. అందుకే మా బ్యానరును పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మార్చనున్నాను. నాకు నటన కంటే దర్శకత్వం, సంగీత దర్శకత్వం వహించడం అంటే ఎంతో ఇష్టం. నేను నిర్మించే చిత్రాల్లో ఇతర హీరోలు నటించకపోవడం వల్లే నేను హీరోగా నటిస్తున్నాను. 'శక్తి తిరుమగన్'ను 'అరువి', 'వాళ్' వంటి చిత్రాలను దర్శకత్వం వహించిన అరుణ్ ప్రభు దర్శకత్వం వహించారు. ఈ కథ విన్నాను. రెండో భాగం అర్థంకాలేదు. ఆ తర్వాత మరింత వివరంగా వివరించాక, కథలోని సారాంశాన్ని తెలుసుకున్నాను. అరుణ్ ప్రభు దర్శకత్వంలో మరో చిత్రంలో నటించనున్నాను' అని విజయ్ ఆంటోనీ పేర్కొన్నారు.

మరోమారు అదృష్టాన్ని పరీక్షించుకోనున్న రమీర్ రాజా

చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి ఓటమి చవిచూసిన హీరో రమీర్ రాజా మరోమారు తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. దాదాపు ఏడేళ్ళ సుదీర్ఘ విరామం తర్వాత ఆయన సొంతంగా సినిమా నిర్మిస్తూ అందులో హీరోగా నటించనున్నారు. ఈ అంశంపై రమీర్ రాజా మాట్లాడుతూ, 'ప్రస్తుతం ప్రేక్షకులు హర్రర్, థ్రిల్లర్ మూవీలను అమితంగా ఇష్టపడుతున్నారు. అందుకే నా తదుపరి చిత్రాన్ని ఆ జోనర్‌లోనే రూపొందించనున్నాను. కథా చర్చలు సాగుతున్నాయి. నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక కూడా జరుగుతోంది. ఈ చిత్రంలో నేను హీరోగా సరికొత్త పాత్ర పోషిస్తున్నాను. ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో తెరకెక్కించేలా ప్లాన్ చేస్తున్నాం. నేను నటించిన 'డార్లిగ్-2'తో మరికొన్ని చిత్రాలకు ప్రేక్షకుల ఆదరణ మరువలేనిది. ఈ కొత్త చిత్రానికి కూడా వారు అదే తరహా ఆదరణను చూపిస్తారని ఆశిస్తున్నానన్నారు.



చిత్రజ్యోతి

ప్రేమ కోసం లింగ మార్పిడి

తమ ప్రేమను గెలిపించుకునేందుకు లింగ మార్పిడి చేయించుకునే యువజంట ప్రేమకు కుటుంబ సభ్యులతో పాటు సమాజం అంగీకరించిందా? లేదా? అనే కథాంశంతో జీవీపీ పిక్చర్స్ పతాకంపై 'శరీరం' పేరుతో కొత్త చిత్రాన్ని నిర్మించినట్టు నూతన దర్శకుడు జీవీ పెరుమాల్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టు వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'శరీరం అనేది దేవుడిచ్చిన బహుమతి. దాన్ని ఎవరూ అర్థం చేసుకోరు. తమ శరీరాన్ని మార్చుకునే హక్కు ఎవరికీ లేదు. అయితే, ఒక జంట ప్రేమించుకోగా, వారి కుటుంబ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తారు. దీంతో ఎలా జీవించాలో తెలియక... ప్రేమ కోసం వారు లింగమార్పిడి చేయించుకుంటారు. అంటే ప్రియురాలు అబ్బాయిగాను, ప్రియుడు అమ్మాయిగా మారుతారు. ఆ తర్వాత ఈ ప్రేమ జంటను సమాజం అంగీకరించిందా? లేదా? వారి విధి ఎలా ఉంటుందనేదే ఈ చిత్ర కథ. ఇది ఒక క్లాసిక్ ప్రేమకథ. ఈ నెల 26న విడుదలచేస్తాం' అని తెలిపారు. ఈ మూవీలో కొత్త నటీనటులు దర్శన్, ఛార్మీ హీరో హీరోయిన్లుగా నటించగా, ఇతర పాత్రల్లో జె.మనోజ్, బాయ్స్ ఫేం రాజన్, షకీలా, మధుమిత, పుదుక్కోట సురేష్, గౌరి, లిల్లీ, మిలా తదితరులు నటించారు. చిత్తూరు, వేలూరు, బెంగళూరు, పుదుచ్చేరి, మహాబలిపురం, కోవలం, చెన్నై తదితర ప్రాంతాల్లో షూటింగ్ చేశారు.



'శరీరం'లో దర్శన్ - ఛార్మి

కోలీవుడ్‌కు మరో ప్రపంచ సుందరి

ప్రపంచ సుందరీమణులుగా నిలిచిన ఐశ్వర్యరాయ్, సుష్మితా సేన్, ప్రియాంకా చోప్రా వంటివారు హీరోయిన్లుగా రాణించగా, ఇపుడు ఇదేకోవలో మరో ప్రపంచ సుందరి సుమన్ రావు కోలీవుడ్‌లో హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. 2019లో మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొని రెండో స్థానంలో నిలిచిన ఈమె... గతంలో ఒక హిందీ చిత్రంలో నటించారు. ఇపుడు 'డైవా' అనే తమిళ చిత్రంలో నటించారు. ఈ మూవీలో పవన్, మహాలక్ష్మి సుందర్శన్, విఘ్నేష్ ఆదిత్య తదితరులు నటించారు. బాల సుబ్రహ్మణ్యం, శాంతకుమార్ చంద్రమోహన్ దర్శకత్వం వహించారు. ఈ మూవీ నుంచి సుమన్ రావు లుక్‌ను చిత్ర బృందం రిలీజ్ చేసింది. ఇందులో అన్సరసి అనే పాత్రలో నటించినట్టు ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో వెల్లడిస్తూ, 'మీ అందరినీ త్వరలోనే కలుసుకునేందుకు అన్సరసి ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తుంది' అని పేర్కొన్నారు.



సుమన్ రావు

పాకశాస్త్రంలో ప్రావీణ్యం..

నోరూరించే వంటలకు ప్రత్యేకం

● విదేశీయుల జిహ్వారుచులను పెంచే మాస్టర్ చెఫ్ సౌమ్యా వెంకటేశన్



కుడుముల్లా ఉన్న తినుబండారం 'కో డియే' - మరో తినుబండారం 'సీ గువే' - రొయ్యల వంటకం 'ప్రాణ్ ఫాస్టర్'



ఇంటిలో వంటచేస్తున్న సౌమ్య

వంట వార్పులో ఓనమాలు కూడా తెలియని సౌమ్య నేడు సింగపూరులో అగ్రశ్రేణి పాకశాస్త్ర ప్రావీణ్యురాలిగా రాణిస్తోంది. కొత్త రకం వంటలను రుచి చూపించి సింగపూర్‌వాసుల నోళ్లూరిస్తోంది. సింగపూరులో జరిగిన 'మాస్టర్ చెఫ్ సింగపూర్' పోటీలో ఫైనలిస్టుల్లో ఒకరిగా ఎంపికైన సౌమ్య భారతీయ వంటకాలతోపాటు విదేశీ వంటలను కూడా రుచిగా, శుచిగా తయారు చేసి అందరినీ ఆకట్టుకుంటోంది. సౌమ్యా వెంకటేశన్ విజయ గాథ నేటి తరుణిలో....


- టి.నగర్, ఆంధ్రజ్యోతి

తరుణి

బెంగళూరులో జన్మించిన సౌమ్య తల్లిదండ్రుల ఉద్యోగం కారణంగా ఢిల్లీలో పెరిగారు. ఆమె రాజన్ ప్రభును వివాహం చేసుకుని చెన్నై నగర కోడలిగా మారారు. కొన్నేళ్ల తర్వాత ఆమె సింగపూర్‌లో స్థిరపడ్డారు. అక్కడే ఐబీఎం కంపెనీలో పనిచేస్తున్నారు. ఆమె భర్త బ్యాంకులకు సేవలందించే సాంకేతిక సంస్థలో పనిచేస్తున్నారు. ఈ దంపతుల 20 యేళ్ళ కుమారుడు సింగపూర్ సైన్యంలో చేరాడు. వివాహం అయ్యేంతవరకూ రుచికరమైన ఆహారం తినడం తప్ప వంటవార్పు గురించి ఏమీ తెలియవని సౌమ్యా ప్రస్తుతం ఇంటర్నేషనల్ చెఫ్‌గా ఉంటున్నారంటే అందరికీ ఆశ్చర్యం కలుగక తప్పదు.

అమ్మ కానుక...

పెళ్ళయిన తర్వాత రేపు వంట ఏమి చేయాలనుకుంటున్నావ్ అని భర్త అడిగినప్పుడే భార్యగా వంట చేసే బాధ్యత ఉందని తనకు తెలిసి వచ్చింది. ఢిల్లీలో ఉన్నప్పుడు రోజూ బ్రెడ్ తినేదాన్ని. ఆ విధంగానే బ్రెడ్‌పై బట్టర్ రాసి భర్తకు ఇచ్చాను. వెంటనే ఆయన 'నాకేమీ జ్వరం లేదే... నేనెందుకు బ్రెడ్ తినాలి?' అని అడిగారు. చెన్నైలో జ్వరం వస్తేనే బ్రెడ్ తింటారని తెలుసుకున్నాను. ఆ తర్వాత వంట ఎలా చేయాలో అమ్మకు, బామ్మకు ఫోన్ చేసి తెలుసుకున్నారు. నా అమ్మగారైతే ముత్యాల్లాంటి అక్షరాలతో వంటలు ఎలా తయారు చేయాలో సవివరంగా రాసిమరీ పంపేవారు. వంటలో నా అమ్మే గురువు. అమ్మచేతి వంట నాకు బాగా అబ్బింది. అప్పటి నుంచి కొత్త రకం రుచులతో వంటలు చేసి భర్తను సంతోషపెట్టేదాన్ని. అమ్మ చేతి చలువే నేనిప్పుడు సింగపూర్‌లో జరిగే 'మాస్టర్ చెఫ్' ప్రోగ్రామ్ ద్వారా ప్రపంచానికి పరిచయమయ్యానని ఆమె గర్వంగా చెబుతున్నారు. ఆమె సహోద్యోగులే ఆ కార్యక్రమంలో పాల్గొనేందుకు తోడ్పడ్డారు. జంకుతూనే వెళ్ళి సెలక్ట్ అయిన తర్వాత ఎలాంటి బెరుకూ లేకుండా ప్రోగ్రామ్‌లో పాల్గొని విన్నర్‌గా నిలిచారు. ఆ తర్వాత తన పాకశాస్త్ర ప్రావీణ్యతపై అంతర్జాలంలో పోస్టు చేసి, దానికి 'కెచిల్ కిచెన్' అని పేరు పెట్టి పాప్ అప్ సంస్థగా మార్చారు. కెచిల్ అంటే మలేసియా భాషలో 'చిన్న' అని అర్థం. ఆ తర్వాత పలు రెస్టారెంట్లకు సలహా ఇచ్చే సంస్థగా ఎదిగి ఏడేళ్లకు పైగా సమర్థవంతంగా పనిచేస్తోంది. సింగపూర్‌లో పలు రెస్టారెంట్లలో కస్టమర్ల సంఖ్య పెరగటానికి సౌమ్యా వెంకటేశనే కారణమని చెప్పటం అతిశయోక్తి కాదు.



సలాడ్‌లాంటి 'రోజాక్'

శుచి, రుచి, నాణ్యతకు ప్రాధాన్యం...

సింగపూర్‌లో భారతీయులు, చైనీయులు, మలేసియన్ల ఎలాంటి వంటలు ఇష్టపడతారో తెలుసుకుని అందుకు తగినట్లుగా ఆమె సలహాలు ఇచ్చేవారు. ఆర్గానిక్ పంటలతో తయారయ్యే వంటలకు విస్తృత ప్రచారం కల్పించడంలోనే సౌమ్యా వెంకటేశన్ విజయం సాధించారు. సింగపూర్‌లో రుచి, శుచితోపాటు నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇస్తారు కనుక వంటల తయారీలో ఆయా రెస్టారెంట్ల చెఫ్‌లకు ఆమె ప్రత్యేక పాఠాలు కూడా బోధిస్తారు. వీటన్నింటికీ తోడు సింగపూర్ టెలివిజన్‌లో ప్రసారమయ్యే వంటా వార్పూ కార్యక్రమాలకు సౌమ్యా వెంకటేశన్ న్యాయనిర్ణేతగాను వ్యవహరిస్తున్నారు.

పాకశాస్త్రంలో ఇంతటి ఉన్నత స్థితికి చేరుకోవడానికి కృషి, పట్టుదల, శ్రద్ధ అవసరమని, అంకితభావంతో వంట చేస్తే ఏ వంటకమైనా జిహ్వా రుచిని పెంచకతప్పదని ఆమె వంటలపై ఆసక్తి ఉన్నవారికి సూచన చేశారు.



సింగపూర్ టీవీషోలో

ఆర్ఎంకేవీలో కొత్త సిల్క్ శారీ డిజైన్లు

అడయార్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రముఖ వస్త్ర దుకాణాల్లో ఒకటైన ఆర్ఎంకేవీ సిల్క్స్ ఈ పండుగ సీజన్‌ను పురస్కరించుకుని 15 రకాలైన కొత్త సిల్క్ శారీ డిజైన్లను ప్రవేశపెట్టింది. గత వందేళ్ళలో 110కి పైగా స్పెషల్ సిల్క్ శారీ డిజైన్లను ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో 2025 పండుగ సీజన్‌ను పురస్కరించుకుని జపనీస్ ఆర్ట్, ఇండియన్ హెరిటేజ్ ప్రేరణతో కొత్త సిల్క్ శారీ డిజైన్లను ప్రవేశపెట్టింది. వీటిలో సషికో రివర్సబుల్, కోర్వై జపాన్, మౌంట్ ఫుజి, నేచురల్ పీచ్ గ్రేడియంట్, మొచ్చ మౌస్, వాన్ గోగ్ లినో, రాసలీల సిల్క్ శారీ, డబ్లా లినో వర్ణ, నేచురల్ క్రిశాంతిమమ్, ముగప్పగమ్ నేచురల్, గ్రేడియంట్ వర్ణ, కొట్టాడి కట్టామ్, కార్నర్ మాంగో, కుయిల్ కన్నన్ కోర్వై, కుమో కోర్వై తదితర డిజైన్లున్నాయి. వీటిని ఆర్ఎంకేవీ డిజైన్ స్టూడియో అండ్ ఊవెన్ ఆవిష్కరించిందని ఆర్ఎంకేవీ యజమానులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



పూర్వీకుల ఇంటికి ఎడ్ల బండిలో నవదంపతులు!

చెన్నై, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక యుగంలో వివాహం అయిన తరువాత వధూవరులు ఎక్కడికైనా కారులోనే వెళ్లడం చూస్తున్నాం.. కానీ కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చిలో ఓ జంట వివాహం అయిన తరువాత తమ పూర్వీకుల ఇంటికి ఎద్దుల బండిలో వెళ్లడం స్థానికులను ఆశ్చర్యంలో ముంచెత్తింది.. పొల్లాచ్చి సమీపంలోని అర్ధనారిపాళయంకు చెందిన శివ ప్రకాష్ అనే యువకుడికి కోయంబత్తూరు చెందిన కావ్యా అనే యువతికి కరట్టు మఠం ప్రాంతంలోని ఓ కళ్యాణ మండపంలో అట్టహాసంగా వివాహం జరిగింది. పెళ్ళయిన వెంటనే వరుడు శివప్రకాష్ తన భార్యను ఎద్దుల బండిలో అర్ధనారిపాళయంలో ఉన్న తన పూర్వీకుల ఇంటికి తీసుకెళ్ళాలని నిర్ణయించాడు. ఆ మేరకు పెళ్ళయిన వెంటనే కావ్యాను ఎద్దులబండిపై కూర్చోబెట్టి శివ ప్రకాష్ ఎద్దుల బండిని తోలుకుంటూ వెళ్ళాడు. నవ దంపతులు ఎద్దుల బండిపై వెళ్తుండటం చూసి సుమారు ఐదు కిలోమీటర్ల దూరం వరకూ దారికి ఇరువైపులా ఇళ్లలో ఉన్నవారంతా ఆశ్చర్యపోయారు. అర్ధనారిపాళయంలోని పూర్వీకుల ఇంటి వద్ద నవదంపతులకు భారీ స్థాయిలో స్వాగత సత్కారాలు నిర్వహించారు.



ఎడ్లబండిలో వెళుతున్న నవ దంపతులు

పళ్లిపట్టులో 'ఆవణి' ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకారంలో పొదటూర్‌పేట మారియమ్మన్

తిరుత్తణి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని అమ్మవారి ఆలయాల్లో గురువారం ఆవణి మాసం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పొదటూర్‌పేటలోని కడుమారియమ్మన్ ఆలయంలో ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. అదేవిధంగా పాండ్రవేడులోని మారియమ్మన్ ఆలయంలో కూడా గురువారం సాయంత్రం నిర్వహించిన కుంభం కార్యక్రమంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని సేవించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని పురవీధుల్లో ఊరేగించారు. ఇదిలా ఉండగా, పళ్లిపట్టు సమీపంలోని బొమ్మరాజుపేట, కేశవరాజుకుప్పం, చావటూరు, కాకుటూరు, అతిమాంజేరి పేట సహా 20 గ్రామాల్లో ఆవణి ఉత్సవాలు ద్రావిడ సాంప్రదాయాల ప్రకారం వైభవంగా నిర్వహించారు.



పాండ్రవేడులోని మారియమ్మన్

ఎఫ్‌పీటీఏ జాతీయ మహానాడు ప్రారంభం



మహానాడు లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో టీఎన్‌పీఎల్ ఛైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ డా.సందీప్‌సింగ్ సక్సేనా, నిర్వాహకులు

ప్యారీస్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఫెడరేషన్ ఆఫ్ పేపర్ ట్రేడర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌పీటీఏ) మూడు రోజుల జాతీయ మహానాడు శుక్రవారం ఉదయం ప్రారంభం కాగా, దేశవ్యాప్తంగా 36 సంఘాలకు చెందిన 600 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. తొలిరోజు మహానాడులో భాగంగా నిర్వహించిన 64వ సర్వసభ్య సమావేశంలో ఎఫ్‌పీటీఏ జాతీయ అధ్యక్షులుగా చెన్నైకి చెందిన రాజేష్ జైన్ ఎంపికైనట్లు నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. తమిళనాడు న్యూస్ ప్రింట్ అండ్ పేపర్ లిమిటెడ్ (టీఎన్‌పీఎల్) ఛైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ డా.సందీప్‌సింగ్ సక్సేనా ప్రారంభించిన ఈ మహానాడులో ష్మైహల్‌జే మెహతా, వేద్ కృష్ణా, సైఫిల్‌జాని, ప్రకాష్‌కాట్ తదితర వాణిజ్య రంగప్రముఖులు అతిథులుగా పాల్గొన్నారు.



నుంగంబాక్కం మదర్‌థెరిస్సా మహిళా ప్రాంగణంలో మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన నవరాత్రి బొమ్మల అమ్మకాలను ప్రారంభిస్తున్న గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గగన్‌దీప్‌సింగ్ బేదీ



పుదుచ్చేరి ఆరోవిల్‌లో శుక్రవారం 75 యేళ్ల భారత ప్రజాస్వామ్యం, మైలు రాళ్లు, సవాళ్లు, భవిష్యత్ అవధులు' అనే అంశంపై జరిగిన సదస్సులో ప్రసంగిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి



సత్యపాల్ సింగ్ బాగల్ - జస్టిస్ అవినాష్ జింగన్ - అనిరుధ్ - సప్తగిరి - సుధా

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో కేంద్రమంత్రి సత్యపాల్‌సింగ్ బాగల్, రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అవినాష్ జింగన్, రాజస్థాన్ మంత్రి కన్హయ్య లాల్ చౌదరి, జార్ఖండ్ మాజీ సీఎం సర్యురాయ్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఉన్నారు. ఇంకా సంగీత దర్శకుడు అనిరుధ్, నటి సుధా, నటుడు సప్తగిరి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

17న తైక్వాండో క్రీడాకారుల ఎంపిక

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో ఈ నెల 17న అండర్ 14, 17, 19 బాలబాలికల తైక్వాండో, స్విమ్మింగ్ జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు కిషోర్‌కుమార్, భార్గవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకున్న వారు అర్హులని, ఆసక్తిగల బాలబాలికలు సొంత క్రీడా సామగ్రితో హాజరుకావాలని కోరారు. హెచ్‌ఎం నుంచి వయస్సు ధ్రువీకరణ పత్రం, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు పదవ తరగతి ఒరిజినల్ మార్కులిస్టుతో రావాల్సి ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 8121777077(స్విమ్మింగ్), 9032956111 (తైక్వాండో)లను సంప్రదించాలని కోరారు.

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణ తేజ విశ్రాంతి భవనం మీదుగా శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.81 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,312

తలనీలాలు సమర్పించినవారు: 27,728



గుడి తాళాలకీ, బండి తాళాలకీ

తేడా తెలీదా భూమనా?

● టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి



భానుప్రకాష్‌రెడ్డి

తిరుమల, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): 'ఏందయ్యా కరుణాకర్‌రెడ్డి గారు.. గతంలో రెండు సార్లు టీటీడీ చైర్మన్‌గా పనిచేశారు. మూడుసార్లు సభ్యుడిగా ఉన్నారు. బండి తాళాలకు, గుడి తాళాలకు తేడా కూడా తెలియదా మీకు?' అంటూ టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. తిరుమల శ్రీవారి ఆలయం ముం దు శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, చంద్రగ్రహణం రోజున మహద్వారం గేట్‌కు టీటీడీ సిబ్బంది తాళాలు వేస్తే చైర్మన్ సైన్యం చేతిలో తాళాలున్నాయని అబద్దాలు ప్రచారం చేశారని చెప్పారు.టీవీ5 రిపోర్టర్ బండి తాళాలు పట్టుకుని మహద్వారం వద్ద ఫొటో దిగితే మహద్వారం గేటు తాళాలని అబద్ధాలు ప్రచారం చేశారు. మరి సాక్షి రిపోర్టరు కూడా అలానే ఫొటో దిగారు అది కనిపించలేదా కరుణాకర్‌రెడ్డీ అని నిలదీశారు. టీటీడీపై అసత్య, అబద్ధపు ప్రచారాలు చేసినా, ఫేక్ న్యూస్‌లు వేసినా క్రిమినల్ కేసులు పెట్టేలా రానున్న బోర్డు సమావేశంలో తీర్మానం చేస్తామని భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు.

తిరుమలలో దొంగ దొరికాడు

● 15 సెల్‌ఫోన్లు, 20 గ్రాముల బంగారు స్వాధీనం



పోలీసుల అదుపులో కిషోర్‌రెడ్డి, స్వాధీనపరుచుకున్న బంగారు, సెల్‌ఫోన్లు

తిరుమల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భక్తుల నుంచి సెల్‌ఫోన్లు, బంగారు ఆభరణాలు కొట్టేసే దొంగను తిరుమల పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 15 సెల్‌ఫోన్లు, 20గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనపరుచుకున్నారు. తెలంగాణలోని నల్గొండ జిల్లా, పాత సూర్యాపేటకు చెందిన మెట్టు కిషోర్‌రెడ్డి కొంతకాలంగా తిరుమలను కేంద్రం చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్టు పోలీసులు గుర్తించారు. ఇతను గత నెలలో సీ టైప్ కార్వర్స్‌లోనూ ఇంటి తాళాలు పగలగొట్టి 20 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు రూ.40 వేల నగదు అపహరించినట్టు విచారణలో వెల్లడైంది. కిషోర్‌రెడ్డిని జ్యుడీషియల్ రిమాండ్ కోసం తిరుపతికి పంపారు.

ఇసుక అక్రమ రవాణాకు మైనర్లు

● పట్టించుకోని అధికారులు

రేణిగుంట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలంలోని స్వర్ణముఖి నది తీర ప్రాంతం నుంచి ఇసుకను యథేచ్ఛగా దోచుకోవడమే కాకుండా మైనర్లని ట్రాక్టర్ డ్రైవర్లుగా వినియోగించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. స్వర్ణముఖి నది తీర ప్రాంతంలోని జీపాళెం, పిల్లపాళెం, తాతయ్యకాలవ, గాజులమండ్యం, పన్నీరుకాలువ, కొత్త మంగళం పరిసరాల్లో స్వర్ణముఖి నది తీరంతో పాటు, ప్రైవేటు భూముల్లో ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల పోటీతత్వంతో అధిక మొత్తంలో ఇసుకను రవాణా చేయాలని దురుద్దేశంతో కొంతమంది ఇసుకాసురులు ఏకంగా మైనర్లను కనీసం లైసెన్స్ లేకుండా ఇసుక అక్రమ రవాణాకు డ్రైవర్లుగా వినియోగిస్తున్నారు. రోడ్లపై జరగరానిది జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు స్పందించి బాలురతో ఇసుక రవాణా చేస్తున్న ఇసకాసురులపై చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఈ విషయంపై డీఎస్పీ శ్రీనివాసరావుని వివరణ కోరగా రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మైనర్లతో ఇసుక ట్రాక్టర్లను తోలిస్తే ఎక్కడికక్కడ వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఎంత కాలం విచారిస్తారో!



కాల్వ వంకలో నిర్మించిన రేకుల షెడ్డు, రూమ్..

రేణిగుంట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మా దృష్టికి రాలేదు. విచారించి చర్యలు తీసుకుంటాం. ఇదీ ఆక్రమణలపై రెవెన్యూ అధికారుల స్టాక్ డైలాగ్. ఎంతకాలం విచారిస్తారో కానీ.. ఆ ఆక్రమణ స్థలాల్లో నిర్మాణాలూ జరిగిపోతుంటాయి. ఇలాంటిదే రేణిగుంట మండలం గాజులమండ్యం పంచాయతీ నీలసానిపేటలో చోటుచేసుకుంది. ఇక్కడి సర్వేనెం.1147లో కాలువ వంక 2.84ఎకరాల్లో విస్తీర్ణంలో ఉంది. గతంలో ఈ కాల్వ వంకలో సేద్యం చేస్తుండే వారు. ఆ తర్వాత రాత్రికి రాత్రే ఆ భూమిలో షెడ్ వెలిసింది. ఇందులో నిర్మాణాలు చేపడుతున్నట్టు ఇటీవల జరిగిన మండల సర్వసభ సమావేశంలో ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చర్యలు తీసుకుంటామని ఆ సమావేశంలో రెవెన్యూ అధికారే చెప్పారు. కానీ ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. ఆ తర్వాత ఆక్రమణదారులు ఇళ్ల నిర్మాణానికి గుంతలు తవ్వారు. ఇలా చూస్తుండగానే ఇంటి నిర్మాణమూ పూర్తయ్యేలా ఉందే కానీ.. అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు.



పక్కనే ఇంటి నిర్మాణానికి తవ్విన గుంతలు

స్కిట్‌లో తరగతుల ప్రారంభానికి సన్నద్ధం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూతో అనుబంధంగా స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో తరగతులు త్వరలో ప్రారంభించడానికి సర్వం సన్నద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే సుధీర్, అనంతపురం జేఎన్‌టీయూ వైస్ ఛాన్స్‌లర్ సుదర్శన్‌రావు సంయుక్తంగా తెలిపారు. నాలుగేళ్ల క్రితం మూతపడిన స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను తెరిపిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలో భాగంగా గత నెలలో ఆ ప్రక్రియ పూర్తి చేసిన విషయం తెలిసిందే. రెండో విడత ఏఈఏపీసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా స్కిట్ కళాశాలలో అడ్మిషన్ల కోసం వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. అలాగే మూడో విడత కౌన్సెలింగ్‌లో భాగంగా మళ్లీ ఇదే కళాశాలలో విద్యార్థులు అడ్మిషన్లు పొందేందుకు అవకాశం కల్పించారు. శుక్రవారం ఎమ్మెల్యే, జేఎన్‌టీయూ వీసీ కళాశాలను సంయుక్తంగా పరిశీలించారు. మొదటి సంవత్సరం నిర్వహణ కోసం యుద్ధప్రాదికన సిద్ధం చేస్తున్న తరగతి గదులు, డిజిటల్, కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించారు. ముక్కంటి ఆలయం సహాయంతో విద్యార్థులకు వసతి సదుపాయం కల్పిస్తున్న అంశంపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో మూడో విడత కౌన్సెలింగ్ ముగిసిన వెంటనే తరగతి గదులు ప్రారంభమవుతాయన్నారు. స్థానిక విద్యార్థులు మూడో విడత కౌన్సిలింగ్‌లో అడ్మిషన్లు పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవేంద్రరెడ్డి, టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు, మోహీద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



స్కిట్ కళాశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, వైస్ ఛాన్స్‌లర్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బాఘేల్

చంద్రగిరి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్థిక లబ్ధికోసం మహిళలు పాల ఉత్పత్తి మాత్రమే కాకుండా కోళ్ల పెంపకం, చేపల సాగు, పందుల పెంపకం వంటి రంగాలలోనూ రాణించాలని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ భాఘేల్ సూచించారు. చంద్రగిరి మండలం మల్లయ్యపల్లెలోని శ్రీజ డెయిరీ మహిళా పాల ఉత్పత్తిదారుల సంస్థను గురువారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన శ్రీజలో సంస్థలో ఉన్న మహిళా పాడి ఉత్పత్తిదారులతో సంభాషించారు. సంస్థ నిర్వహణ విధివిధానాలను పరిశీలించారు. పాల ఉత్పత్తిదారులతో శ్రీజ సంస్థ అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.



శ్రీజ డెయిరీని పరిశీలిస్తున్న మంత్రి ఎస్పీ సింగ్ బాఘేల్

నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్, డెయిరీ సర్వీసెస్ శ్రీజ సంస్థకు అందిస్తున్న సహకారాన్ని అడిగి తెలుసుకున్నారు. దేశంలోనే డెయిరీ రంగ అభివృద్ధిలో శ్రీజ సంస్థ భాగస్వామ్యాన్ని ఆయన ప్రశంసించారు. పంచాయితీ రాజ్ వ్యవస్థల ద్వారా అనేక గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల్లో మహిళల చురుకైన పాత్ర పోషించాలని తెలియజేశారు. అనంతరం మహిళా పాల ఉత్పత్తిదారులను లాఖ్‌పతి దిదీస్‌లను ఎంపిక చేసి మంత్రి ఘనంగా సత్కరించారు. తర్వాత మల్లయ్యపల్లె టీడీపీ నాయకుడు బీగాల మహేష్ రాయల్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేంద్రమంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీజ కంపెనీ సీఈఓ తిమ్మప్ప, హెడ్ రాజేంద్రబాబు, పీబీఐ హెడ్ నిశాంత్, తిరుపతి ఏరియా మేనేజర్ రమేష్, పీఐబీ మోహన్, తహసీల్దార్ శివరామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

'మెడికల్ డైలాగ్స్'లో ఆంధ్రజ్యోతి కథనం

తిరుపతి, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య రంగానికి సంబంధించి జాతీయస్థాయిలో విశ్వసనీయత కలిగిన 'మెడికల్ డైలాగ్స్' వెబ్ న్యూస్‌లో నిబంధనలు పాటించని స్విమ్స్ నోటిఫికేషన్ అంశాన్ని ప్రస్తావిస్తూ శుక్రవారం ఓ కథనం రాసుకొచ్చింది. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'చదువు చెప్పిన చోటే వద్దంటోంది' శీర్షిన ప్రచురితమైన వార్తను ఉటంకించింది. అదేవిధంగా డెంటిస్ట్రీ పోస్టును మార్చిన తీరును ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన అంశాన్నీ ప్రస్తావించింది. మెడికల్ డైలాగ్స్ నుంచి వార్తాంశాలను వైద్య, ఆరోగ్య రంగం కీలకంగా పరిగణిస్తుంటోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌వో) కూడా సదరు వెబ్‌సైట్‌లోని అంశాలను అనుసరిస్తుంటోందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. స్విమ్స్ నోటిఫికేషన్ లోపాలను స్థానిక మీడియా కథనాలు ప్రచురిస్తోందని మెడికల్ డైలాగ్స్ తన కథనంలో పేర్కొంది. వైద్య అభ్యర్థులు సదరు వెబ్ లింక్‌ను వైరల్ చేస్తే తమ వెతలను వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతికి ధన్యవాదాలు చెబుతున్నారు.

తల్లీ కూతుళ్ల కిడ్నాప్

● నిందితులపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇక, వివాహేతర సంబంధం మానేద్దామన్న వివాహితను బెదిరించాడు. ఆమెను, ఆమె తల్లిని కిడ్నాప్ చేసి దాడికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులపై కిడ్నాప్, హత్యాయత్నం కింద ఈస్ట్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. తిరుపతికి చెందిన ఓ వివాహిత ఇంటి వద్ద టైలరింగ్ పనులు చేస్తోంది. ఈమె భర్త సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఈ క్రమంలో కొర్లగుంటలోని అజీమ్‌తో ఈమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం ఎక్కడ ఇంట్లో తెలిసిపోతోందనే ఆలోచనతో ఆమె సంబంధం తెంచుకోవాలని అజీమ్‌కు చెప్పింది. దీనికి అతడు అంగీకరించలేదు. ఈ క్రమంలో లక్ష్మీపురం సర్కిల్‌లోని జిమ్ వద్దకు రావాలని ఆ మహిళ, ఆమె తల్లికి ఫోను చేశాడు. డ్రైవర్ బబ్లూతో కలిసి వారిని బలవంతంగా కారులో తీసుకెళ్లాడు. తన ప్రేమ కాదంటే ఇద్దరినీ చంపి తగుల బెడతానని బెదిరించి దాడి చేశాడు. దీనిపై బాధితులు 112కు ఫోన్ చేసి తమను కిడ్నాపర్ల బారి నుంచి కాపాడాలని పోలీసులను వేడుకున్నారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తమ సిబ్బందితో కలసి ఘటనా స్థలికి చేరుకుని వారి ఆచూకీ కోసం గాలించారు. అజీమ్ వాడుతున్న మొబైల్ నెంబరు ఆధారంగా వారిని గుర్తించి లక్ష్మీపురం సర్కిల్ వద్ద మాటు వేసి పట్టుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఆయన చెప్పారు.

యాంకర్ హబ్‌గా తిరుపతి

జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల గమ్యస్థానంగా తిరుపతిని తీర్చిదిద్దుతాం

ప్రాంతీయ పెట్టుబడిదారుల సమావేశంలో మంత్రి దుర్గేష్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): 'పెట్టుబడులతో రండి. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేద్దాం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టిద్దాం' అంటూ ఇన్వెస్టర్లకు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. తిరుపతిలో శుక్రవారం జరిగిన ప్రాంతీయ పెట్టుబడిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ, తిరుపతిల్లో పర్యాటకరంగ అభివృద్ధికి సంబంధించి ప్రణాళికను వివరించారు. తిరుపతిని మైస్ టూరిజం సెంటర్‌గా, ఓ యాంకర్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్టు చెప్పారు. శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చే భక్తులు రెండు మూడు రోజులు ఇక్కడే ఉండి ఇతర పర్యాటక ప్రాంతాలను సందర్శించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. దీనికోసం చంద్రగిరి కోట, ఎస్వీ జూపార్కు, తలకోన, సూళ్లూరుపేట, నేలపట్టులోని పక్షుల విహార కేంద్రాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ క్రమంలో పర్యాటకుల వసతికి అవసరమైన స్టార్ హోటళ్లు, రిసార్టులు, కాటేజీల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అంచనా మేరకు క్యారవాన్ టూరిజంకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. శేషాచలం అడవుల్లో అడ్వెంచర్ టూరిజం, వాటర్ స్పోర్ట్స్ ట్రెక్కింగ్ తదితర ప్రక్రియను ప్రవేశపెడితే బాగుంటుందని ఆలోచిస్తున్నట్టు చెప్పారు. ఎర్రచందనం లభిస్తున్న ఈ ప్రాంతంలో ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళిక చేస్తున్నామన్నారు. తిరుపతి ప్రాంతంలో అటవీ, దేవదాయ, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎకో టూరిజం అభివృద్ధికి ఇప్పటికే కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. కోనసీమలోని మండువాల తరహాలో తిరుపతిలో పాతకాలం నాటి ఇళ్లలో, పురాతన కట్టడాలలో హోమ్‌స్టేలు ఏర్పాటు చేస్తామన్నారు. స్పష్టమైన ప్రతిపాదనలతో, ఆలోచనతో పర్యాటక అభివృద్ధికి ముందుకొచ్చే ఇన్వెస్టర్లకు ప్రభుత్వం అవసరమైన భూమి, రాయితీలు, ప్రోత్సాహం అందిస్తుందని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు త్వరితగతిన జారీ చేస్తామన్నారు. ఇన్వెస్టర్లపై భారం పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. హోమ్‌స్టేలు, పర్యాటక పాలసీకి సంబంధించిన మార్గదర్శకాలను ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి వివరించారు. పెట్టుబడిదారులకు ఏ ఇబ్బంది వచ్చినా తాను పరిష్కరిస్తానని, అనుమతుల మంజూరు తదితరాల విషయంలో అండగా ఉంటానని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, కలెక్టర్ వెంకటేశ్వర్, నరసింహ యాదవ్, సుగుణమ్మ, పసుపులేటి హరిప్రసాద్, టూర్ ఆపరేటర్స్ అసోయేషన్ అధ్యక్షుడు విజయ్ మోహన్, సీఐఐ దామోదర నాయుడు, ఔత్సాహిక ఇన్వెస్టర్లు పాల్గొన్నారు.

● తిరుపతిని వ్యూహాత్మక పర్యాటక ప్రదేశంగా ప్రభుత్వం భావిస్తోంది. తిరుపతి మొదలు సమీప ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు పర్యాటక పెట్టుబడిదారులను ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. అందులో భాగంగా స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) ద్వారా రూ3,482 కోట్ల విలువైన హాస్పిటాలిటీ ప్రాజెక్టులకు కేబినెట్‌లో ఆమోదం లభించింది. తద్వారా హోటళ్లలో 2,698 గదుల ఏర్పాటుకు అవకాశం ఉంది. సుమారు 11,645 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

● తిరుపతి సమీపంలో అట్మాస్పియర్, నోవాటెల్, మారియట్, ఒబెరాయ్, లెమన్ ట్రీ, మహేంద్ర తదితర సంస్థలతో రిసార్ట్స్, హోటళ్లు నిర్మించేందుకు ఎంవోయూలు చేసుకున్నాం. దుబాయ్ తరహాలో మీటింగ్, ఇన్సెంటివ్ కాన్ఫరెన్సులు, ఎగ్జిబిషన్ (మైస్) టూరిజంను అభివృద్ధి చేస్తాం.

తిరుత్తణిలో ఘనంగా కృత్తిక ఉత్సవాలు



తిరుత్తణి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆవణి కృత్తిక ఉత్సవాలు సందర్భంగా శుక్రవారం తిరుత్తణి మురుగన్ ఆలయానికి భక్తులు పోటెత్తారు. లక్షలాదిమంది భక్తులు కావళ్లతో పాదయాత్రగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 5 గంటలకు మంగళవాయిద్యాలు, శైవపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలనుండి వేల సంఖ్యలో భక్తులు శుక్రవారం వేకువజామున ఆలయ ప్రాంగణాల్లో వేచివుండి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం 5 గంటలకు వల్లీ,దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి నెమలి వాహనంపై పురవీధుల్లో ఊరేగారు.

మినీ బస్సులుగా 'మాక్సీక్యాబ్' వ్యాన్‌లు

పెరంబూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాక్సీ క్యాబ్ వ్యాన్లను మినీ బస్సులుగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామీణ, కొండ ప్రాంతాల్లో ప్రజా రవాణా సులభతరం చేసేలా చర్యలు చేపట్టిన ప్రభుత్వం, ఆ ప్రాంతాలకు మినీ బస్సులు నడపనున్నట్లు జూన్‌లో ప్రకటించింది. ఈ మేరకు, రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు భాగస్వామ్యంతో వెయ్యి మినీ బస్సు సేవలు అందుబాటులో ఉన్నాయి. కానీ, ఆశించిన మేర ప్రైవేటు భాగస్వామ్యం రాకపోవడంపై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం, మాక్సీ క్యాబ్ వ్యాన్లను మినీ బస్సులుగా నడపాలని నిర్ణయించింది. ఇందుకోసం యజమానులు తమ వ్యాన్‌లు మినీ బస్సులుగా నడిపేందుకు సంబంధిత జిల్లా యంత్రాంగం, ప్రాంతీయ రవాణా కార్యాలయాలను సంప్రదించాలని రవాణా శాఖ తెలిపింది.

రూ.69.30లక్షలతో మూడు ల్యాబ్‌లు



ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాల

ఏర్పేడు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏర్పేడులోని జడ్పీఉన్నత పాఠశాలలో మూడు ల్యాబ్‌లు ఏర్పాటు కానున్నాయి. ఒక్కో ల్యాబ్‌కు రూ.23.10లక్షలు మంజూరయ్యాయి. సైన్స్ ల్యాబ్, రెండు ఆటిజం సెంటర్లు రెండు ఏర్పాటు కానున్నాయి. సైన్స్ ల్యాబ్ ఏర్పాటుతో విద్యార్థులే సైన్స్‌లె మరింత పట్టుసాధించవచ్చు. గత ఐదేళ్లలో ఈ సెంటర్లు కావాలని ఉపాధ్యాయులు పదే పదే జిల్లా స్థాయి అధికారులకు ప్రతిపాదనలు పంపినప్పటికీ గత ప్రభుత్వంలో మంజూరు కాలేదు.

22 నుంచి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు

తిరుచానూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి 4.30గంటల వరకు ఆలయంలోని శ్రీకృష్ణస్వామి ముఖమండపం వద్ద పద్మావతి అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహిస్తారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహిస్తారు. అక్టోబరు 2వ తేదీ విజయదశమినాడు రాత్రి 7.45గంటలకు పద్మావతి అమ్మవారు గజవాహనపై ఊరేగి భక్తులకు దర్శనమిస్తారు. **ఆర్జిత సేవలు రద్దు** : నవరాత్రి ఉత్సవాల కారణంగా ఆలయంలో ఈ పదిరోజుల పాటు కల్యాణోత్సవ సేవను రద్దు చేశారు. అదే విధంగా సెప్టెంబరు 26న లక్ష్మీపూజ సేవలు రద్దు చేశారు.

ఎంత పెద్ద కంటైనర్లో..!



ఒక దాని వెనుక మరొకటి. ఇలా ఐదు భారీ కంటైనర్లు రేణిగుంట మండలం రామకృష్ణాపురం కూడలి సమీపంలో రోడ్డు పక్కన శుక్రవారం ఆపారు. తమిళనాడు రాష్ట్రం వేలూరు నుంచి అనంతపురం జిల్లా తాడిపత్రికి గాలి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే పరికరాలను తరలిస్తున్న ఈ కంటైనర్లు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడే నిలిపేశారు. భారీ వాహనాలు కావడంతో పగటిపూట వెళ్తే రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉండడంతో రాత్రి 10 గంటల తర్వాత బయలుదేరాయి.

- రేణిగుంట ఆంధ్రజ్యోతి